



# చట్టం మీ చుట్టం

జాతీయ తెలుగు దిన పత్రిక

సంపుటి : 14 • సంచిక : 46 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi శుక్రవారం 27 ఫిబ్రవరి 2026 • పేజీలు : 8 • వెల 2/-


## ప్రధాని నరేంద్రమోడీ అరుదైన రికార్డు

### ఇన్‌స్టాలో వంద మిలియన్లు దాటిన ఫాలోవర్లు



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి26 :** భారత ప్రధాని నరేంద్ర మోదీ మరో అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. ప్రపంచంలో 100 మిలియన్ ఇన్‌స్టా ఫాలోవర్లు కలిగిన తొలి రాజకీయ నేతగా సరికొత్త రికార్డును నెలకొల్పారు. 2014లో ప్రధాని మోదీ తొలిసారిగా ఇన్‌స్టాగ్రామ్‌లో చేరారు. యువతరానికి

మిగతా 2వ పేజీలో..

## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

- మొత్తం 45మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు
- పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం




**హైదరాబాద్,ఫిబ్రవరి26 (చట్టం న్యూస్):** తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మొత్తం 45 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఒకేసారి 45 మంది ఐఏఎస్ అధికారులకు

మిగతా 2వ పేజీలో..

## తిరుమల లడ్డూపై మండలిలో స్వల్పకాలిక చర్చ


- పరస్పర విమర్శలతో సభలో గందరగోళం
- చర్చకు ముందే ప్రకటన చేస్తామన్న మంత్రి కేశవ్
- చర్చకు ముందు కుదరదన్న ఛైర్మన్
- గందరగోళం మధ్యే సభ నేటికి వాయిదా



**అమరావతి,ఫిబ్రవరి26 (చట్టం న్యూస్):** ఏపీ శాసనమండలిలో తిరుమల లడ్డూ అంశంపై స్వల్పకాలిక చర్చలో వాదోపవాదాల మధ్య చర్చ ప్రారంభం అయ్యింది. అయితే పరస్పర విమర్శలతో సభను ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు శుక్రవారానికి వాయిదా వేశారు. చర్చ సందర్భంగా అధికార, విపక్ష సభ్యుల ఆందోళనలతో గందరగోళం ఏర్పడటంతో సమావేశాలను ఛైర్మన్ శుక్రవారం వాయిదా వేశారు. స్వల్పకాలిక చర్చలో భాగంగా తొలుత వైసీపీ సభ్యుడు పర్వతనేని చంద్రశేఖర్ రెడ్డికి మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారు ఛైర్మన్. చర్చ సాగుతుండగా ప్రభుత్వం తరఫున స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు తనకు అవకాశం కల్పించాలని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. స్వల్పకాలిక చర్చలో స్టేట్‌మెంట్ చేసే అవకాశం మంత్రికి ఉండదని.. రిప్లై మాత్రమే ఉంటుందని మండలి ఛైర్మన్ స్పష్టం చేశారు. స్టేట్‌మెంట్ కాపీలు సిద్ధం చేయాలని మండలి ఛైర్మన్ లేఖ రాశారని పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. తన అనుమతి లేకుండా ఆ లేఖ సిద్ధం చేశారని ఛైర్మన్ తెలిపారు. ఈ క్రమంలో కల్తీ నెయ్యి అంశంపై శాసనమండలిలో గందరగోళం నెలకొంది. చర్చకు ప్రతిపక్షానికి ముందుగా అవకాశం ఇస్తామని మండలి ఛైర్మన్ మోషేను రాజు అన్నారు. దీంతో ప్రభుత్వం నుంచి స్టేట్‌మెంట్ వద్దంటారా అంటూ మంత్రి పయ్యావుల కేశవ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. 'స్టేట్‌మెంట్ ఇస్తామని మేము ముందే చెప్పాం. లఘు చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఎంత సమయమైనా చర్చకు అనుమతించండి. అర్ధరాత్రి వరకు చర్చ కొనసాగించినా మాకు ఇబ్బంది లేదు. వినేందుకు కూడా ఓపిక లేనప్పుడు ప్రశ్నలు ఎందుకు అడగాలి. చర్చకు వైకాపా సభ్యులు ఎందుకు భయపడుతున్నారు' అని ప్రశ్నించారు. తిరుమల లడ్డూపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ముందుగా ప్రభుత్వం నుంచి స్టేట్‌మెంట్‌కు

మిగతా 2వ పేజీలో..


## వివాహ బంధంతో ఒక్కటైన విరోష్



**హైదరాబాద్,ఫిబ్రవరి26 (చట్టం న్యూస్):** నటులు విజయ్ దేవరకొండ, రష్మిక వివాహబంధంతో ఒక్కటైనట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం 10.10కి రష్మిక మెడలో విజయ్ మూడుముళ్లు వేసినట్లు సమాచారం . దీంతో ఈ జంటకు అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్ట్‌లు పెడుతున్నారు. ఈ పెళ్లి వేడుక రెండు సంస్కృతులు, సంప్రదాయాల కలయికగా జరుగుతోంది. ఉదయం విజయ్ వైపు నుంచి హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహం జరిగింది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వేదికగా జరుగుతోన్న ఈ వివాహానికి ఇండస్ట్రీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ వివాహ సంబరాల్లో భాగంగా విజయ్ - రష్మిక 'విరోష్ ప్రీమియర్ లీగ్' పేరుతో సరదాగా ఓ చిన్న క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహించినట్లు ఇన్‌స్టా వేదికగా పంచుకున్నారు. అలాగే బుధవారం హల్దీ వేడుకను నిర్వహించినట్లు విరోష్ జోడీ తెలియజేసింది. ఇక వీరి వివాహ విందును మార్చి 4న హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు.

## నదుల అనుసంధానమే శ్రీరామరక్ష

- వంశధార నుంచి పెన్నా వరకూ నదులను అనుసంధానించాలి
- పోలవరం - నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టుతో మేలు
- కాళేశ్వరం కట్టినా మేం అభ్యంతరం చెప్పలేదు
- గోదవరిలో వృధా జలాలు వినియోగంలోకి తెస్తాం
- నదుల అనుసంధానంతో తెలుగుతల్లికి జలహారతి పడతా
- తాగు,సాగునీటి సరఫరా లక్ష్యంగా ప్రాజెక్టుల నిర్మాణం
- సాగునీటి రంగంపై శాసనసభలో సీఎం చంద్రబాబు



**అమరావతి,ఫిబ్రవరి26 (చట్టం న్యూస్):** పోలవరం - నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం లేదని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు మరోమారు స్పష్టం చేశారు. గోదావరి నుంచి సముద్రంలోకి వెళ్లే వృథాగా వరద జలాలను.. ఆయా ప్రాజెక్ట్‌లకు తరలిస్తామని పేర్కొన్నారు. గోదావరిపై ఎగువన తెలంగాణ రాష్ట్రం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిందని, దీనికి తాము అభ్యంతరం చెప్పలేదని ప్రస్తావించారు. రెండు తెలుగు రాష్ట్రాలకూ దీని వల్ల లాభం కలుగుతుందని ఉద్ఘాటించారు. పోలవరం - నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టుకి పొరుగు రాష్ట్రం అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. ప్రకృతిని ఆరాధించడం.. నీటిని పూజించే సంప్రదాయం మనదని సీఎం చంద్రబాబు అన్నారు. గోదావరికి అఖండ హారతి ఇచ్చామని, కృష్ణాకు పవిత్ర హారతి ఇచ్చామని గుర్తు చేస్తూ.. నదులను పూజించడం సంప్రదాయంగా పెట్టుకున్నామని తెలిపారు. సాగునీటి రంగంపై సీఎం చంద్రబాబు శాసనసభలో మాట్లాడారు. గంగా- కావేరి అనుసంధానం కావాలనేది నా ప్రగాఢ ఆకాంక్ష అని చెప్పారు. ఏ పనైనా చిన్న ఆలోచనతోనే మొదలవుతుంది. గంగా-కావేరి అనుసంధానం సాధ్యాసాధ్యాలపై ఆనాడే చర్చలు జరిగాయి. నదుల అనుసంధానం చేసి తెలుగుతల్లికి జలహారతి ఇచ్చే బాధ్యత మాది. నదుల అనుసంధానం వల్ల నీటి సమస్యలు తగ్గుతాయి. రాష్ట్రంలో కట్టిన ప్రాజెక్టులన్నీ ఎన్డీయే లేదా తెదేపా హయాంలోనే జరిగాయి. పట్టిసీమ నుంచి 100 టీఎంసీలు కృష్ణాకు తీసుకొచ్చాం. వెలిగొండ ప్రాజెక్టుకు నేనే శంకుస్థాపన చేశా... నేనే పూర్తి చేస్తున్నా. ధవళేశ్వరం వద్ద బ్యారేజీ నిర్మాణం వల్ల కాటన్ దొరను ఇప్పటికీ గుర్తుపెట్టుకుంటున్నారు. గోదావరి

మిగతా 2వ పేజీలో..

## గ్రామ సచివాలయాలు.. వార్డుల మార్పు

- పంచాయితీరాజ్ చట్టసవరణకు అసెంబ్లీ ఆమోదం
- స్వర్ణగ్రామం, స్వర్ణవార్డులుగా ఇక పిలుపు




**అమరావతి,ఫిబ్రవరి26 :** ఏపీ శాసనసభలో గ్రామ, వార్డు సచివాలయాల చట్ట సవరణ బిల్లుకు ఆమోదం లభించింది. ఈ బిల్లు ద్వారా రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయాలను ఇకపై స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డులుగా

మిగతా 2వ పేజీలో..

## అసైన్డ్ భూముల చట్టసవరణకు అసెంబ్లీ ఆమోదం

- సౌర విద్యుత్ సంస్థలకు లీజుకు ఇచ్చేలా చట్టం
- రాష్ట్రంలో 10వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టుల లక్ష్యం

**అమరావతి,ఫిబ్రవరి26 (చట్టం న్యూస్):** ఏపీ శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో అసైన్డ్ భూముల చట్ట సవరణ బిల్లును రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ.. అసైన్డ్ భూములను సౌర విద్యుత్ సంస్థలకు లీజుకు ఇచ్చేలా చట్టసవరణ చేశామని.. హరిత ఇంధన సంస్థలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కర్బన ఉద్గారాలు సున్నాకు తీసుకురావటమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 10వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటవుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా

మిగతా 2వ పేజీలో..

## గాలేరు-నగరిపై మండలిలో వాదోపవాదాలు

- రాయసలీమ ఎత్తిపోతల ఎప్పటికి పూర్తి చేస్తారన్న బొత్స
- వినే ఓపిక ఉండాలని మంత్రి నిమ్మల ఎదురుదాడి

**అమరావతి,ఫిబ్రవరి26 (చట్టం న్యూస్):** గాలేరు-నగరిపై చర్చలో అధికార, ప్రతిపక్షం మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. గాలేరు నగరి ప్రాజెక్టుపై వైసీపీ సభ్యులు ప్రశ్న లేవనెత్తారు. వరద నీరు కేవలం 30 రోజులు మాత్రమే వస్తుందని.. జగన్ ప్రభుత్వం 3,825 కోట్ల రూపాయలతో రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. గాలేరు నగరి ప్రాజెక్టుకు ఎంత బడ్జెట్ కేటాయించారని.. ఎప్పటిలోగా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. మూడోసారి వాయిదా అనంతరం ఏపీ శాసనమండలి తిరిగి మొదలైంది. రాయలసీయ నీటి ప్రాజెక్టులపైనే మండలిలో మరోసారి రచ్చ జరిగింది. గాలేరు నగరి ప్రాజెక్టు, రాయలసీమ ఎత్తిపోతల పథకం విషయాలపై వైసీపీ సభ్యులు ప్రశ్నలు సంధించగా మంత్రులు సమాధానాలు ఇచ్చారు. మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం ఇస్తూ.. రాయలసీమ ఎత్తిపోతల పథకానికి ఇతర ఎత్తిపోతల పథకాలకు ఉన్న తేడా తెలుసుకుని ప్రశ్నలు అడగాలని సూచించారు. ధైర్యంగా వాకౌట్ చేయకుండా సమాధానాలు వినాలన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై మరోసారి వివరాలు చెబుతానని మంత్రి తెలిపారు. సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. రాయలసీమ ఎత్తిపోతల పథకం అందరికీ అవసరమన్నారు. తెలంగాణ

మిగతా 2వ పేజీలో..



## ఘనంగా గోదావరి పుష్కరాల నిర్వహణ

- మహా కుంభమేలా తరహాలో గోదావరి పుష్కరాలు
- ఎపి కేపబినేట్ సబ్ కమిటీలో నిర్ణయం



**అమరావతి,ఫిబ్రవరి26 (చట్టం న్యూస్):** 2027 జూన్ 26వ తేదీ నుంచి జులై 7వ తేదీ వరకు జరిగే గోదావరి పుష్కరాలను 6 జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధ్యక్షతన 2027

మిగతా 2వ పేజీలో..

## పెన్షన్ల హామీ గుదిబండ కానుందా?

- పెంచితే ఖజానాపై బారీగా భారం
- పెంచకుంటే విపక్షాల నుంచి విమర్శలు
- మల్లగుల్లాలు పడుతున్న అధికార పక్షం



**హైదరాబాద్,ఫిబ్రవరి26 (చట్టం న్యూస్):** ఆరు గ్యారెంటీలు, పెన్షన్ల పెంపు, తులం బంగారంపై విపక్ష బిఆర్ఎస్ ఎక్కడిక్కడ నిలదీస్తోంది. దీనికితోడు వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో సర్కార్‌ను నిలదీసేందుకు సన్నద్ధం అవుతోంది. బడ్జెట్ లెక్కలు వేసుకుంటున్న ప్రభుత్వం ఈ మొత్తాలకు మరింత వెచ్చించాలంటే జంకుతోంది. ఇప్పటికే వేలకోట్లు అప్పులకు గాను వడ్డీలు చెల్లిస్తోంది. 2024

మిగతా 2వ పేజీలో..

# పవిత్ర రోజాలో ఆరోగ్య రహస్యం

(ఆధ్యాత్మికం )



**గుంటూరు,ఫిబ్రవరి26** : రంజాన్ మాసంలో ఉపవాసదీక్ష ప్రత్యేకతే వేరు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపావాస దీక్ష చేయడం ఆరోగ్య రక్షణ రహస్యం దాగివుంది. పవిత్ర గ్రంథమైన ఖురాన్ ప్రకారం ఉపవాస దీక్షలు పాటించడం ఆరోగ్యానికి మంచిదేనని గ్రంథాలు తెలుపుతున్నాయి. రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాసదీక్షలు చేపట్టడడంవల్ల ఎంతో పుణ్యం, మంచి ఆరోగ్యంగా ఉంటామని ఇస్లామిక్ గ్రంథాలు పేర్కొంటున్నాయి. సూర్యోదయానికి ముందు సూర్యాస్తమయం తర్వాత ఆహారం తీసుకోవడం ద్వారా జీర్ణకోశ సంబంధ వ్యాధులు దూరమవుతాయని ప్రకృతి వైద్యులు స్పష్టం చేస్తున్నారు.రోజావల్ల జీర్ణకోశ వ్యాధులు దూరం సహర్, ఇఫ్తార్ వేళలో ఆహారాన్ని తీసుకోవడంలో ఎన్నో శాస్త్రీయ కారణాలు కనిపిస్తున్నాయి. రుషులు, సూర్యోదయానికి ముందు సూర్యాస్తమయం తర్వాత ఆహారాన్ని తీసుకునేవారని, ఉద యం, సాయంత్రం వేళల్లో ఆహారాన్ని స్వీకరించడం ద్వారా ఎన్నో లాభాలున్నాయి. తీసుకున్న ఆహారం సంపూర్ణంగా జీర్ణమవుతుందని, జీర్ణశక్తి పెరుగుతుందని, దీంతో రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. రోజా సమయంలో ఎక్కువగా పండ్లు ఫలాలు తీసుకుంటారని వీటిలో ఫోరిక్ యాసిడ్, కాల్షియం ఉంటాయి. ఇవి ఎనిమియాను దూరం చేస్తాయి. సంవత్సరంలోని 12 నెలల్లో పవిత్రమైన రంజాన్ మాసానికి విశేష ప్రాముఖ్యత ఉంది. సూర్యోదయానికి ముందు ఆహారం తీసుకోవడంలోనే ఆరోగ్యం దాగి వుందని ఇస్లాం బోధిస్తుంది. మహ్మద్ ప్రవక్త కూడా ప్రాతఃకాలానికి ముందే ఆహారాన్ని స్వీకరించేవారని ఆయన అనుచరులు ఎన్నో హదీసులలో వివరించారు. ఉపవాస వ్రతం రోజా ఈ మాసంలోనే విధిగా నిర్ణయించబంది. వేయి మాసాలకన్నా అత్యంత విలువైన రాత్రి లైలతుల్ ఖద్ర్ మానవాళి మార్గదర్శనం కోసం దైవం పంపిన పవిత్ర గ్రంథం ఖురాన్ కూడా ఈ మాసంలోనే అవతరించింది. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న రంజాన్ మాసం రోజాలు ఉండేవారికి అంత పుణ్యం ఉంటుందని ఇస్లామిక్ గ్రంథాలు తెలుపుతున్నాయి. రోజా వల్ల మానవులను మంచివారుగా సౌశీల్యవంతులుగా, దైవభీతి గలవారుగా తీర్చిదిద్ద డం, దీనివల్ల భక్తిని పెంచే అవకాశం ఉంది. స్త్రీ పురుషులందరూ రోజా వ్రతాన్ని తప్పనిసరిగా పాటించాలని దేవుడు ఆదేశించాడు. ఎవరైనా దీన్ని తిరస్కరిస్తే మతభ్రష్టులు, మార్గభ్రష్టులు అయ్యే అవకాశముంది. మానవుల బలహీనతలను, వారి కష్టసుఖాలను బాగా తెలిసిన దేవుడు ఉపవాసాలను విధిగా చేసినప్పటికీ కొందరికి కొన్ని మినహాయింపులు కూడా ప్రసాదించారు. చిన్నపిల్లలు, బాటసారులు, వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, గర్భవతులు, బాలింతలు, మతిస్థిమితంలేని వారు అపరిశుద్ధావస్తలో ఉన్న స్త్రీలు ఉపవాసవ్రతం నుంచి మినహాయింపు ఉంది. ఉపవాసాలు ఉండటంవల్ల మనుషులు ఆరోగ్య వంతులుగా ఉంటారని బ్లడ్ ప్రెషర్, షుగర్ సాధారణ స్థితికి వస్తుందని వైద్యులు సూచిస్తున్నారు. జీర్ణ వ్యవస్థకు విశ్రాంతి కలుగుతుందని తెలిపారు. బరువు తగ్గడానికి ఉపయోగ పడుతుందని తెలిపారు.

# గ్రామ సచివాలయాలు.. వార్డుల మార్పు

**మొదటి పేజి తరువాయి..**

పిలుస్తారు. గురువారం మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఈ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంతో పనిచేస్తోందని, ఈ విజన్‌కు అనుగుణంగా సచివాలయాల విధుల్లో మార్పులు చేశామని మంత్రి వివరించారు. అందుకు తగినట్లుగా సచివాలయాల పేర్లను స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డులుగా మారుస్తూ చట్ట సవరణను ప్రతిపాదించినట్లు తెలిపారు. దీనిపై ఈ ఏడాది జనవరిలో గవర్నర్ గెజిట్ ద్వారా ఆర్డినెన్స్ జారీ చేశారన్నారు మంత్రి. సచివాలయాలు చాలా చోట్ల అ÷-దదె భవనాల్లో నడుస్తున్నాయని, ప్రభుత్వ భవనాలున్న చోటికి వాటిని మారుస్తున్నామని మంత్రి తెలిపారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బందికి పదోన్నతులు కల్పిస్తామని, అన్ని విభాగాల్లో సిబ్బందికి పదోన్నతులు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ స్థాయి అధికారిని గవర్నింగ్ బాడీగా నియమించామని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. ÷ూయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ.. వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు ఈ చట్ట సవరణ ఉపయోగపడుతుందన్నారు. స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డుల పేర్లు ప్రజలను మానసికంగా సిద్ధం చేస్తాయని అన్నారు. రాయలసీమలో ఉద్యాన పంటలు ఎక్కువగా ఉండటంతో అక్కడి సిబ్బందిలో హార్టికల్చర్ నిపుణులను నియమించవచ్చని సూచించారు. అభివృద్ధికి అసలైన చిరునామాగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చాలన్నారు. సంపద సృష్టించే క్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు అన్నారు. విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ.. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర 2047 ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం పీ4 కార్యక్రమాన్ని సచివాలయాల ద్వారా అమలు చేస్తోందని చెప్పారు. సచివాలయ సిబ్బందికి గవర్నింగ్ బాడీ ఎవరనే విషయంలో స్పష్టత లేదని.. దీనిపై చట్ట సవరణ ద్వారా స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు.

# నదుల అనుసంధానమే శ్రీరామరక్ష

**మొదటి పేజి తరువాయి..**

జిల్లాల్లో కాటన్ దొర విగ్రహాలు పెట్టి పూజిస్తున్నారని చంద్రబాబు అన్నారు. 2047 విజన్‌లో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రధానంగా నీటి భద్రతపైనే దృష్టి సారించిందని సీఎం వ్యాఖ్యానించారు. గోదావరి, కృష్ణా పుష్కరాలను కూడా ఘనంగా నిర్వహించే బాధ్యత తమ ప్రభుత్వానికే దక్కిందని తెలిపారు. గోదావరికి అఖండ హారతి, కృష్ణా నదికి పవిత్ర హారతి ఇవ్వడం ద్వారా జలాలను అత్యంత విలువైన వనరుగా భావిస్తున్నామని పేర్కొన్నారు. గోదావరి నది నుంచి సగటున ఏడాదికి 3 వేల టీఎంసీల నీళ్లు సముద్రంలోకి వృథాగా పోతున్నాయని వివరించారు. వంశధార నుంచి పెన్నా వరకూ రాష్ట్రంలో నదులను అనుసంధానిస్తే సమస్యలు పరిష్కారమవుతాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. గంగా-కావేరీ అనుసంధానం జరగాలన్నది తన ప్రగాఢమైన ఆకాంక్ష అని చెప్పుకొచ్చారు. గంగా - కావేరి అనుసంధానం సాధ్యాసాధ్యాలపై ఆనాడే చర్చలు జరిగాయని ప్రస్తావించారు. నదులు అనుసంధానం చేసి, తెలుగు తల్లికి జలహారతి ఇచ్చేలా ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. హంద్రీనీవా ద్వారా 738 కిలోమీటర్ల మేర కాలువలను విస్తరించి కుప్పంలో పరమ సముద్రం చెరువు వరకూ నీరిచ్చామని వివరించారు. మడకశిర వరకూ నీళ్లు తీసుకెళ్లి ఆ ప్రాంత దాహార్తిని తీర్చామన్నారు. ఎన్టీఆర్ హయాంలోనే రాయలసీమకు తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీనీవా లాంటి ప్రాజెక్టులు చేపట్టినట్లు ప్రస్తావించారు. సాగునీటిపై 2014 నుంచి 2019లో రూ.68 వేల కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. గడిచిన 20 నెలలుగా రూ.20 వేల కోట్ల వరకూ ఖర్చు చేయగలిగామని వివరించారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకూ నీరిచ్చి, శ్రీశైలంలో నీటిని పొదుపు చేసి 100 టీఎంసీలను రాయలసీమకు తరలించామని వెల్లడించారు. అందుకే ఆ ప్రాంతం రతనాల సీమగా మారిందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి మార్కాపురంతో సహా వివిధ ప్రాంతాలకు న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబు భరోసా కల్పించారు. ఆర్థిక ఇబ్బందులున్నా కూడా మార్కాపురం, ఒంగోలు జిల్లాలను సస్యశ్యామలం చేస్తామని సీఎం చంద్రబాబు మాటిచ్చారు. 30 ఏళ్ల ముందు ఆ ప్రాజెక్టు శంకుస్థాపన చేసి.. మొదటి దశను ఈ ఏడాది జూలైలోనే పూర్తి చేసి నీళ్లు ఇస్తామని చెప్పుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2500 కోట్ల మేర ఇంకా ఖర్చు చేయాల్సి ఉందని వివరించారు. రూ.456 కోట్లతో ఫీడర్ కాలువ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేశామని అన్నారు. ఈ క్రెడిట్ మొత్తం వైసీపీనే చోరీ చేస్తోందని ఆగ్రహించారు. వెలిగొండకు నీళ్లు రాకుండానే జగన్ రెడ్డి రిబ్బన్ కట్ చేశారని ఎద్దేవా చేశారు. కుప్పం లోనూ ట్యాంకర్లు తీసుకువచ్చి కాలువలో పోశారని విమర్శించారు. జగన్ హయాంలోని ఐదేళ్లలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులని నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. రూ.2 వేల కోట్లతో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులన్నీ దశలవారీగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేశారని ఫైర్ అయ్యారు. డయాఫ్రాం వాల్‌ను గోదాట్లో కలిపేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో మళ్లీ ఆ ప్రాజెక్టును పరుగులు పెట్టిస్తున్నామని చెప్పుకొచ్చారు. పుష్కరాలకంటే ముందు ఆ ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని మాటిచ్చారు. చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేసి ఏలూరు, కృష్ణా జిల్లాలకు నీరు అందించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. 1312 టీఎంసీల నీటిని ఏపీ ప్రాజెక్టుల్లో నిల్వ చేసుకునే అవకాశం ఉందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'ప్రస్తుతం 793 టీఎంసీల నీటితో రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లూ కళకళలాడుతున్నాయి. మే 15 తేదీన నారుమళ్లకు నీరిచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. 16 లక్షల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ సాగుతో దేశంలోనే అగ్రస్థానంలో ఏపీ ఉంది. నీటి నిర్వహణ నుంచి పొదుపు చేసే వరకూ నీటి వినియోగదారుల సంఘాలకు అప్పగిస్తున్నాం. ఏపీ వ్యాప్తంగా భూగర్భ జలాల పెంపునకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సగటున 7 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉన్నాయి. భూగర్భజలాలు గణనీయంగా పెరగటంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ మోటార్ల ద్వారా వినియోగం కూడా తగ్గింది. తద్వారా రూ.91 కోట్ల మేర విద్యుత్ కూడా ఆదా అయ్యింది. ఏపీలో 50 శాతం గ్రీన్ కవర్ పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఒక్క తిరుమలలోనే 89 శాతం మేర పచ్చదనం ఉంది. గత పాలనలో గుండ్ల కమ్మ గేట్లు కొట్టుకుపోతే గేట్లు పెట్టేందుకు కూడా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. వైసీపీ హయాంలో పోలవరం డయాఫ్రాం వాల్ కొట్టుకుపోతే.. దాన్ని కూడా గుర్తించలేదు. జగన్ హయాంలో చేయని తప్పునకు నన్ను 53 రోజుల పాటు జైల్లో పెట్టారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకూ నీరు ఇవ్వాలనే లక్ష్యంతోనే పనిచేస్తున్నాను. కావేరిపై రెండు రాష్ట్రాలు ఎలా కొట్టుకున్నాయో చూశాం. నీరుంటే ఎలాంటి సమస్యలూ రావు. నీటి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. కొందరు రాజకీయం కోసమే నీటి సమస్యల్ని తీసుకొస్తున్నారు. ఏపీకి ఉండే వాటర్ సెక్యూరిటీ దక్షిణ భారత్‌లో మరే రాష్ట్రానికీ లేదు. భూమినే జలాశయంగా మార్చి నీటి సంరక్షణ చేయాలని అందరికీ పిలుపునిస్తున్నాను. వ్యవసాయానికి, పరిశ్రమలకు నీరు ఇవ్వడంతో పాటూ ప్రతి ఇంటికీ తాగునీరు ఇస్తే లక్ష్యాన్ని సాధించినట్లే. తెలుగు తల్లికి జలహారతి ఇచ్చేలా ప్రతి ఎకరాకూ నీరిచ్చే ధృఢ సంకల్పంతో పనిచేస్తున్నాం. రాష్ట్రంలో ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు బ్లూ ప్రింట్‌ను కూడా సిద్ధం చేస్తున్నాం' అని సీఎం నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. చేయని నేరానికి నన్ను గత పాలకులు.. 53 రోజులు పాటు జైల్లో పెట్టారు. రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీరు ఇవ్వాలన్న లక్ష్యంతోనే పని చేస్తున్నా. కావేరిపై రెండు రాష్ట్రాలు ఎలా కొట్లాడుకుంటున్నాయో చూశాం. నీరు పుష్కలంగా ఉంటే ఎలాంటి సమస్యలు రావు. నీటి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. కొందరు రాజకీయం కోసమే నీటి సమస్యలను తీసుకొస్తున్నారు. ఏపీకి ఉండే వాటర్‌సెక్యూరిటీ దక్షిణ భారత్‌లో మరే రాష్ట్రానికీ లేదు. భూమినే జలాశయంగా మార్చి నీటి సంరక్షణ చేయాలని అందరికీ పిలుపునిస్తున్నా. సాగునీరు, పరిశ్రమలకు నీరు, ప్రతి ఇంటికీ తాగునీరు ఇస్తే లక్ష్యం సాధించినట్లే. తెలుగుతల్లికి జలహారతి ఇచ్చేలా ప్రతి ఎకరాకు నీరివ్వాలని సంకల్పం. రాష్ట్రంలో ప్రాజెక్టుల పూర్తికి బ్లూప్రింట్ సిద్ధం చేస్తున్నాం అని చంద్రబాబు వివరించారు.

# పెన్షన్ల హామీ గుదిబండ కానుందా?

**మొదటి పేజి తరువాయి..**

సామాజిక సర్వే లెక్కల ప్రకారం ప్రస్తుతం 42.7 లక్షల మందికి పింఛను అందుతోంది. ఇందుకోసం ప్రతి నెలా రూ.950 కోట్ల వరకు ఖర్చవుతోంది. ఈ పింఛన్‌ను ప్రస్తుతానికి రూ.500 చొప్పున పెంచితే.. నెలకు సుమారు రూ.210 కోట్లు అదనంగా అవసరమవుతాయి. అంటే ఏడాదికి రూ.2500 కోట్లకు పైగా భారం ప్రభుత్వంపై పడనుంది. దీనిపై తుది నిర్ణయానికి వచ్చాక బ్జడెట్‌లో కూడా ప్రస్తావించే అవకాశాలున్నాయి. తొలి విడతలో పెంచాలని భావిస్తున్న మొత్తాన్ని కూడా కలిపి బ్జడెట్‌లో కేటాయింపులు చేయన్నుట్లు తెలుస్తోంది. కాగా, దివ్యాంగుల పింఛను పొందేవారు తక్కువ సంఖ్యలోనే ఉన్నారని, వీటి వరకు కొంత ఎక్కువ మొత్తం పెంచాలన్న విజ్ఞప్తులు కూడా ఉన్నాయి. అయితే అందరికీ ఒకే విధంగా, సమ స్థాయిలోనే పెంచాలని ప్రభుత్వం ప్రాథమికంగా ఒక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. చేయూత ఫించన్లను ఇలా విడతల వారీగా పెంచుతూ ఎన్నికల నాటికి రూ.4 వేలకు తీసుకెళ్లాలన్న యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారుల స్థాయిలో మాత్రం చర్చలు మొదలుకాలేదు. ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకున్నాకే తమకు సమాచారం చేరుతుందని ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేయూత పథకం కింద ఇస్తున్న పింఛన్‌ను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా.. పింఛను మొత్తాన్ని విడతల వారీగా పెంచాలన్న అభిప్రాయంతో ఉంది. ప్రస్తుతం చేయూత పథకం ద్వారా వృద్ధులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ రోగులు, డయాలసిస్ రోగులు, చేనేత, గీత కార్మికులు, బీడీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2016 చొప్పున, దివ్యాంగులకు రూ.4016 చొప్పున పింఛను ఇస్తోంది. కానీ, ఎన్నికల సమయంలో చేయూత పింఛన్‌ను రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం వంటి హామీలను అమలులోకి తెచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు.. ఇప్పుడు పింఛన్ల పెంపుపై దృష్టి సారించింది. అయితే ఈ హామీని కొంతకాలం ఆగాక నెరవేర్చడమా? లేదంటే ఇప్పటి నుంచే విడతల వారీగా పింఛను పెంచుతూ వెళ్లడమా? అని ఉన్నత స్థాయిలో చర్చ జరిగినట్లు సమాచారం. విడతలవారీగా పెంచితే.. తొలి విడతలో రూ.500 పెంచాలన్న అభిప్రాయంతో ప్రభుత్వం ఉందని తెలుస్తోంది.

# తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

**మొదటి పేజి తరువాయి..**

బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో కలెక్టర్ల స్థాయిలో పెద్దఎత్తున మార్పులు చోటుచేసుకున్నాయి. పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం జరిగింది. మహబూబాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు. టీఎస్‌జీపీడీసీఎల్‌కు కొత్త సీఎండీ నియామకం జరిగింది. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితుల య్యారు. బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శిగానూ ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌కుమార్, విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌ను నియమించారు. ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్, దేవాదాయశాఖ కమిషనర్‌గా ఎం.హనుమంతరావు, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా డి.దివ్యను ప్రభుత్వం నియమించింది. వీరితో పాటు పలు జిల్లా కలెక్టర్లనూ ప్రభుత్వం బదిలీ చేసింది. యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా అనురాగ్ జయంతిని నియమించింది.పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సంజయ్ కుమార్‌ను నియమించారు. విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా దాన కిషోర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా శ్రీధర్‌ను నియమించారు. ఎండోమెంట్స్ కమిషనర్‌గా హనుమంతరావుకు కొత్త బాధ్యతలు అప్పగించారు. ఫైనాన్స్ శాఖ సెక్రటరీగా గౌరవ్ ఉప్పల్‌ను నియమించారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్.శ్రీధర్‌కు బాధ్యతలు అప్పగించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా చిత్రా మిశ్రాను నియమించారు. విజయేంద్ర - మహబూబ్‌నగర్ కలెక్టర్ పదవి నుంచి సోషల్ వెల్ఫేర్ శాఖ కార్యదర్శిగా నియామకం అయ్యారు. అద్వైత్ కుమార్ సింగ్ - మహబూబాబాద్ నుంచి ఢిల్లీ తెలంగాణ భవన్ సమన్వయ శాఖకు బదిలీ అయ్యారు. సిక్తా పట్నాయక్ - నారాయణపేట్ నుంచి ఆర్థిక శాఖకు ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ అయ్యారు. సందీప్ కుమార్ ఝా - జనగాం కలెక్టర్‌గా నియామకం అయ్యారు. ముష్రఫ్ అలీ ఫారూఖీ - టీఎస్‌జీపీడీసీఎల్ సీఎండీగా నియామకం అయ్యారు. జితేష్ వి.పాటిల్ - టీఎస్‌జీపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. స్నేహ శబరీష్ - మహబూబాబాద్ కలెక్టర్‌గా నియామకం అయ్యారు. గరిమా అగర్వాల్- రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా నియామకం జరిగింది. ప్రతిమ సింగ్ - మెదక్ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. అనికేత్ - భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా ,చాహత్ బజ్పాయి - హనుమకొండ కలెక్టర్‌గా,ఖుష్బూ గుప్తా - మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా , పమేలా సత్పతి - లేబర్ కమిషనర్‌గా, అనురాగ్ జయంతి - యాదాద్రి కలెక్టర్‌గా ,ప్రదీప్ జైన్ - నారాయణపేట్ కలెక్టర్‌గా నియామకం జరిగింది.

# గాలేరు-నగరిపై మండలిలో వాదోపవాదాలు

**మొదటి పేజి తరువాయి..**

సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు వాస్తవమా? కాదా? అని ప్రశ్నించారు. ఈ పథకాన్ని ఎప్పటిలోగా ప్రారంభించి, ఎప్పటిలోగా పూర్తి చేస్తారో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్ని ట్రిబ్యునల్ గొడవలు వచ్చినా ఆనాటి ప్రభుత్వం ముందుకు వెళ్లిందని బొత్స సత్యనారాయణ గుర్తు చేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు మరోసారి స్పందిస్తూ.. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన రోజే మాజీ మంత్రి హరీశ్ రావు కూడా మాట్లాడారని అన్నారు. 'జగన్‌తో మాట్లాడాం... అంతకుమించి ముందుకు వెళ్ళవద్దని జగన్‌కు చెప్పినట్లు బీఆర్ఎస్ నాయకులు చెప్పారు' అని తెలిపారు. తెలంగాణ రాజకీయ ప్రయోజనాల కోసం వారు మాట్లాడారని మంత్రి చెప్పారు. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. రాయలసీమ లిఫ్ట్ విషయంలో తప్పంతా వైసీపీదే అని ఆరోపించారు. ప్రాజెక్టును ఆపి తప్పు చేసింది ఎవరో వైసీపీ నేతలు తెలుసుకోవాలన్నారు. సభా సాక్షిగా రాయలసీమకు జగన్ సర్కారు ఏమీ చేయలేదని వైసీపీ సభ్యులు నిరూపించారని చెప్పారు. 'జగన్‌తో మాట్లాడి రాయలసీమ లిఫ్ట్‌పై తామే స్టే తెచ్చామని ఆనాటి ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హరీశ్ రావు స్పష్టంగా చెప్పారు. ఈ విషయాన్ని తెలంగాణ శాసనసభ వేదికగా హరీశ్ రావు తెలిపారు' అని మంత్రి గుర్తుచేశారు. చేతకాని వైసీపీ దద్దమ్మ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టిందని విమర్శించారు. ప్రాజెక్టు ఆపితే... చేతకాకుండా కోర్టుకు వెళ్లి అఫిడవిట్ వేస్తే దానికి తాము సమాధానం చెప్పాలా అంటూ మంత్రి పయ్యావుల కేశవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఘనంగా గోదావరి పుష్కరాల నిర్వహణ

**మొదటి పేజి తరువాయి..**

గోదావరి పుష్కరాలపై క్యాబినెట్ సబ్ కమిటీ గురువారం సచివాలయంలో భేటీ అయింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులు చర్చించారు. ఈ సమావేశానికి మంత్రులు కందుల దుర్గేశ్, బీసీ జనార్దన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, గొట్టిపాటి రవి కుమార్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఐదు అంశాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. గత భేటీలోని అంశాలు, గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖలు రూపొందించిన పీపీటీలు, మంత్రుల సలహాలు, సూచనలు తదితర అంశాలపై చర్చించింది. మహా కుంభమేలా తరహాలో గోదావరి పుష్కరాలు నిర్వహించాలని క్యాబినెట్ సబ్ కమిటీ భావించింది. 8 నుంచి 10 కోట్ల మంది ఈ పుష్కరాలకు వస్తారని క్యాబినెట్ సబ్ కమిటీ అంచనా వేస్తోంది. 4516 మీటర్ల మేర 373 ఘాట్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలకు అంచనా వేసింది. గతంలో ఉన్న 234 ఘాట్ల సంఖ్య పెంపునకు చర్యలు చేపట్టింది. పుష్కరాల ప్రధాన రోజుల్లో దాదాపు కోటి మంది వస్తారని అంచనా వేసింది. పవిత్ర స్నానానికి 2.25 కోట్ల మంది వస్తారని అంచనా వేసింది. భక్తుల సౌకర్యార్థం పిండ ప్రదానం ఘాట్లు, శానిటేషన్ పక్రియ, రోడ్లు, వాటర్ తదితర విషయాల్లో పక్కా ప్రణాళిక ఉండాలని క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. సాధారణ ధరలకే టెంట్ సిటీలు, హోమ్ స్టేలు ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్‌తో క్యాబినెట్ సభ కమిటీ చర్చించింది. ఈస్ట్ గోదావరిలో 102 ఘాట్లు, వెస్ట్ గోదావరి 40, కోనసీమ 175, ఏలూరు 36, కాకినాడ 5, పోలవరం జిల్లాలో 11 ఘాట్లు.. మొత్తంగా 369 ఘాట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఏపీలో మొదటి గోదావరి పుష్కర ఘాట్ పోలవరం జిల్లాలో గుండాల, చివరి ఘాట్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది, బలుసుతిప్ప, కాకినాడలో గోవలంక ఘాట్, వెస్ట్ గోదావరిలో నర్సాపురం ఘాట్ అని కమిటీ వెల్లడించింది. భక్తుల భద్రతకు పెద్దపీట వేయాలని నిర్ణయం తీసుకుంది. శాఖల మధ్య సమన్వయం కోసం ప్రత్యేకంగా నోడల్ ఆఫీసర్లను నియమించాలని క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది.

# అసైన్డ్ భూముల చట్టసవరణకు అసెంబ్లీ ఆమోదం

**మొదటి పేజి తరువాయి..**

7 లక్షల 50 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని అంచనా వేస్తున్నామన్నారు. గతంలో ఇలాంటి ప్రాజెక్టులకు అసైన్డ్ భూములు తీసుకోవడం సాధ్యమయ్యేది కాదని, చట్ట సవరణ ద్వారా అసైన్డ్ భూములు లీజుకు ఇచ్చే వెసులుబాటు కలుగుతోందని మంత్రి తెలిపారు. తద్వారా అసైన్డ్ భూముల యజమానులకు అ÷-దదె రూపంలో ఆదాయం వస్తుందన్నారు. రెండేళ్లకు ఒకసారి లీజు మొత్తాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటి వరకు వివిధ ప్రభుత్వాలు కలిపి 35 లక్షల ఎకరాల భూములను అసైన్డ్ చేశాయని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. అసైన్డ్ భూములు చాలా చోట్ల చేతులు మారాయని.. పేదల నుంచి భూములు తీసుకున్నవారు లబ్ది పొందుతున్నారని తెలిపారు. అసలు లబ్దిదారులకే లీజు డబ్బు అందేలా చూడాలని సూచించారు. కొన్ని చోట్ల అసైన్డ్ భూముల్లో పండ్ల తోటలు సాగు చేస్తున్నారని, అలాంటి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వైసీపీ హయాంలో భూముల ఫ్రీ-హోల్డ్‌లో కుంభకోణం జరిగిందని, దీనిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు.

# తిరుమల లడ్డూపై మండలిలో స్వల్పకాలిక చర్చ

**మొదటి పేజి తరువాయి..**

అవకాశం కల్పించాలన్నారు మంత్రి. చర్చకు ప్రభుత్వం భయపడుతోందని విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. దేవదేవుడి ప్రసాదాన్ని రాజకీయాలకు వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు. తిరుమల లడ్డూపై సభలో చర్చ చేపట్టాలని వైసీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం, గందరగోళం ఏర్పడింది. ఈ నేపథ్యంలో శాసనమండలి సమావేశాలను రేపటికి వాయిదా వేస్తున్నట్లు మండలి ఛైర్మన్ మోషేన్ రాజు ప్రకటించారు.

# ప్రధాని నరేంద్రమోడీ అరుదైన రికార్డు

**మొదటి పేజి తరువాయి..**

కనెక్ట్ కావడంతో ఆయన ఫాలోవర్ల సంఖ్య నాటి నుంచీ పెరుగుతూనే ఉంది. ఫాలోవర్ల సంఖ్యాపరంగా ప్రధాని మోదీ తరువాతి స్థానంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిలిచారు. ఆయనను ఇన్‌స్టాలో ఫాలో అయ్యే వారి సంఖ్య 43.2 మిలియన్‌లు. ఆ తరువాతి స్థానాల్లో ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబొవో సుబియాంతో (15 మిలియన్ ఫాలోవర్లు), బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డి సిల్వా (14.4 మిలియన్ ఫాలోవర్లు), తుర్కియే అధ్యక్షుడు ఎర్డొగాన్ (11.6 మిలియన్ ఫాలోవర్లు), అ÷-జర్గ÷ంటీనా ప్రెసిడెంట్ జేవియర్ (6.4 మిలియన్ ఫాలోవర్లు) ఉన్నారు. ట్రంప్‌తో పాటు ఆ తరువాత నాలుగు స్థానాల్లో ఉన్న నేతల ఫాలోవర్లు సంఖ్యను కూలిపి చూసినా ప్రధాని మోదీ కంటే తక్కువగానే ఉండటం గమనార్హం. ఇక భారతీయ నేతల్లో కూడా ఫాలోవర్ల సంఖ్యాపరంగా ప్రధాని నెం.1గానే ఉన్నారు. ప్రధాని తరువాతి స్థానంలో ఉన్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు 16.1 మిలియన్ ఇన్‌స్టా ఫాలోవర్లు ఉండగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఉన్న ఫాలోవర్ల సంఖ్య 12.6 మిలియన్లు. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉండే ప్రధాని ఇన్‌స్టా వేదికగా వివిధ అధికారిక కార్యక్రమాలు, అంతర్జాతీయ పర్యటనలు, రాజకీయ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు వివరాలను పంచుకుంటూ ఉంటారు. తన మనసులోని భావాలను కూడా ఫాలోవర్లతో షేర్ చేసుకుంటుంటారు.

# ఓట్లు,సీట్లే ముఖ్యం కాదు

- ప్రజా సమస్యల పై నిరంతర పోరాటాలే మా లక్ష్యం
- మతోన్మాదాన్ని ఎదిరిస్తాం, బిజెపిని నిలువరిస్తాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 26 ,(చట్టం బ్యూరో ) :** ప్రస్తుత ఎన్నికల్లో డబ్బు,మద్యం, ఏరులై పారుతుందని, కార్పొరేట్ శక్తులు వ్యాపారులు ఎన్నికల్లో పాల్గొని ధన ప్రభవాన్ని చూపెడుతూ ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తున్నారని, అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రైతు వ్యతిరేక చట్టాలు చేసిందని, జై కిసాన్ అంటూనే 1200 మంది రైతులను నిర్దాక్షిణ్యంగా చంపారని అన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుగుణంగా లేబర్ కోడులను మార్చి కొత్తగా నాలుగు లేబర్ కోడ్ లు తీసుకువచ్చారని, వామపక్షాలు పోరాడి సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రామ్ జీ పేరుతో ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీడియం చేస్తున్నారని అన్నారు. అర్బన్ నక్సలైట్లను, మావోయిస్టులను చంపుతామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్ రావు గుండాయిజం చేస్తున్నారని అన్నారు.

ఎవరైనా తప్పు చేస్తే శిక్షించడానికి కోర్టులు ఉన్నాయని అలాకాకుండా అర్బన్ నక్సలైట్లను చంపేస్తామని అనడానికి అతను ఎవరని ప్రశ్నించారు. జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులు రాజకీయ పార్టీ పెడితే స్వాగతిస్తామని, ఆ రాజకీయ పార్టీ వర్గ దోపిడీకి అసమానతలకు, వ్యతిరేకంగా కార్మికులు కష్టజీవులు ప్రజల పక్షాన పోరాడితే కలిసి పని చేయడానికి అభ్యంతరం లేదని అన్నారు. రాష్ట్రంలో నగర్ కర్నూల్ జిల్లాలో కుల రక్కసి కోరల్లో పసిపాప బలైందని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బాధ్యులను కఠినంగా శిక్షించి ,బాధితులకు సరైన న్యాయం చేయాలని, రాష్ట్రంలో కుల దురంకార హత్యలు అరికట్టాలని అన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కురి వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ బండి సంజయ్ బిజెపికి మేయర్ పదవి ఇస్తే డంపింగ్ యార్డ్ ను తరలిస్తామని ప్రజలను మభ్యపెడుతూ ఓట్లు దండుకోవడం చూస్తుంటే గత తొమ్మిది సంవత్సరాలుగా కరీంనగర్ ఎంపీగా ఉండి డంపింగ్ యార్డ్ ను ఎందుకు తరలించలేదని ప్రశ్నించారు. కేవలం ఓట్ల కోసం కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయపదం గడుపుకుంటున్నారని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, ఎస్ రమ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, గుడి కందుల సత్యం, జి.బీమా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలి

- 100 ఎకరాల్లో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కు ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఆయిల్ పామ్ సాగు, వ్యవసాయ యాంత్రీకీకరణ, రైతుల వివరాల నమోదు, ఫెర్టిలైజర్ యాప్ పై సమీక్ష





**ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ఫిబ్రవరి -- 26,( చట్టం బ్యూరో ) :** ఆయిల్ పామ్ పంట సాగు ద్వారా అధిక దిగుబడితో పాటు దీర్ఘకాలంపాటు అధిక ఆదాయాన్ని పొందవచ్చని, పంట సాగుకు రైతులు ముందుకు రావాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. ఆయిల్ పామ్ సాగు, ఫెర్టిలైజర్ యాప్, వ్యవసాయ యాంత్రీకీకరణ, రైతుల వివరాల నమోదు, క్రాప్ బుకింగ్ తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.

జిల్లాలో క్రాప్ బుకింగ్ కోసం ఏఈఓలకు సహాయం అందించేందుకు 165 మంది వాలంటీర్లను నియమిం చామని కలెక్టర్ దృష్టికి జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం తీసుకువెళ్ళారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. క్రాప్ బుకింగ్ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

ఫార్మర్స్ రిజిస్ట్రీ కింద జిల్లాలోని అందరు రైతుల వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. చనిపోయిన, డబుల్ ఎంట్రీ వివరాలు జాబితాలో లేకుండా పకడ్బందిగా చేయాలని స్పష్టం చేశారు. ఏవోలు, ఏఈవోలు సంయుక్తంగా ఈ ప్రక్రియను రెండు వారాల్లో పూర్తి చేయాలని సూచించారు.

వ్యవసాయ యాంత్రీకీకరణ కింద జిల్లాకు మంజూరు అయిన పరికరాలకు రైతులు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు.

ఫెర్టిలైజర్ యాప్ వినియోగం, రైతులకు అందుతున్న సేవలపై మండలాల వారీగా కలెక్టర్ సమీక్ష చేశారు. ప్రతి ఎరువుల షాప్, పీఏసీఎస్, ప్రైవేట్ షాప్స్ వద్ద హెల్ప్ డెస్క్, సహాయకులు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

**ఆయిల్ పామ్ సాగు పెంచాలి**

జిల్లాలోని రైతులకు ఆయిల్ పామ్ సాగుతో అధిక దిగుబడి, లాభాలు తదితర అంశాలు వివరించి సాగు విస్తీర్ణం పెంచేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. త్వరలో 100 ఎకరాల్లో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులను వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు నేరుగా కలిసి మాట్లాడాలని, వారిని క్షేత్ర స్థాయి పర్యటనకు తీసుకువెళ్లాలని ఆదేశించారు. ప్రతి ఏవో, ఏఈవో 10 ఎకరాల చొప్పున ఆయిల్ పామ్ సాగు కు డీడీలు రైతులు చెల్లించేలా చూడాలని సూచించారు. రైతు వేదికల్లో కనీస వసతులు కల్పించాలని జడ్పీ సీఈవో వినోద్ కుమార్ ను కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

సమీక్ష సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు తదితరులు ఉన్నారు.

# ఆర్యభట్ట కాన్సెప్ట్ స్కూల్ హాస్టల్ విద్యార్థి పై హత్యాయత్నం...







- ఫిబ్రవరి 24 అర్ధ రాత్రి ఈ ఘాతుకం...
- తల్లిదండ్రులు ప్రశ్నిస్తే సమాధానం చెప్పని యాజమాన్యం...
- ఈ ఘటనపై పోలీస్ స్టేషన్ కు వెళ్లొద్దని తల్లిదండ్రులను బెదిరించిన కరస్పాండెంట్...
- కొత్త బిల్డింగ్ నిర్మాణానికి విద్యార్థిని బలి ఇవ్వాలని కరస్పాండెంట్ ఈ ఘటనకు పాల్పడ్డారని విద్యార్థి తల్లి తండ్రుల ఆరోపణ.
- జిల్లా ఉన్నత అధికారులు స్పందించి ఆర్యభట్ట ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్ పై క్రిమినల్ కేసు నమోదు చేసి స్కూలు మూత వేయాలని డిమాండ్.

**మహబూబాబాద్ జిల్లా తొర్రూర్, ఫిబ్రవరి 26 (చట్టం న్యూస్) :** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణ కేంద్రంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లే రహదారి పక్కన ఉన్న ఆర్యభట్ట కాన్సెప్ట్ స్కూల్ లో ఫిబ్రవరి 24 అర్ధరాత్రి, స్కూల్ హాస్టల్ లో ఉంటున్న విద్యార్థి, దారావత్ హర్షవర్ధన్, టీక్యా తండా, పెద్ద వంగర మండలం కు చెందిన ఐదో తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థి గత మూడు సంవత్సరాలుగా ఆర్యభట్ట స్కూల్లో చదువుతున్నాడు మంగళవారం అర్ధరాత్రి విద్యార్థిని కళ్లకు గంతలు కట్టి నోటిలో గుడ్డలు పెట్టి మెడకు, టవాల్ తో ఉరివేసారని, విద్యార్థి తల్లి అనిత తండ్రి సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తోటి విద్యార్థులతో తెలిసి వెంటనే పాఠశాల కరస్పాండెంట్ మధుకర్ రెడ్డిని నిలదీసి అడిగామని సమాధానం చెప్పకుండా, మమ్ములను పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు చేయవద్దని , బెదిరించాడని ఆందోళన వ్యక్తం చేశారు, నా పిల్లవాడిని చంపడానికి ప్రయత్నం , ఎవరు చేశారని కరస్పాండెంట్, ను నిలదీస్తే సమాధానం చెప్పకుండా, వెళ్లిపోయాడని, తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. కావున దీనంతటికీ ఆర్యభట్ట స్కూల్ కరస్పాండ్ కారణమని, కొత్త బిల్డింగ్ కన్స్ట్రక్షన్ కు నా కుమారున్ని బలి ఇవ్వాలని ఈ పని చేశాడని, తల్లిదండ్రులు ఆరోపించారు. కావున జిల్లా కలెక్టర్, ఎస్పీ, విద్యాశాఖ అధికారి, తక్షణమే స్పందించి నా కుమారుడైన హర్షవర్ధన్ చంపుటకు ప్రయత్నించిన, ఆర్యభట్ట పాఠశాల కరస్పాండెంట్ పై న్యాయ విచారణ చేపట్టి, వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి, మాకు న్యాయం చేయాలని బాధిత తల్లిదండ్రులు పేర్కొన్నారు.

# స్పందించరు..పరిష్కరించరు

**కొడిమ్యాల, ఫిబ్రవరి 26 (చట్టం) :** మండలంలోని పలు గ్రామాల్లోని సమస్యలను సామాజిక మాధ్యమాల ముఖంగా అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చినా కొన్ని సమస్యలపై వారు స్పందించకుండా.. పరిష్కరించకుండా గాలికి వదిలేస్తున్నారు. డిజిటల్ మీడియాను ప్రచారాస్త్రాలుగా వాడుకుంటున్నారు గానీ, ఆ మీడియా వార్తలపై వారి చిన్నచూపు కారణంగా కొన్ని సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.

# ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను సందర్శించిన ఎస్సై కిరణ్ కుమార్.




**పెగడపల్లి ఫిబ్రవరి 26( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్లోని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని ఎస్సై కిరణ్ కుమార్,సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ప్రభాకర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# అరైవ్ అలైవ్ అవగాహన సదస్సు నిర్వహించిన వెల్గటూర్ ఎస్సై పి. ఉదయ్ కుమార్




**వెల్గటూర్,ఎండపల్లి, ఫిబ్రవరి 26 చట్టం.:** జగిత్యాల జిల్లా గౌరవ ఎస్పీ శ్రీ. అశోక్ కుమార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా చేపట్టిన తెలంగాణ పోలీస్ శాఖ చేపట్టిన "అరైవ్ అలైవ్ క్యాంపెయిన్‌లో భాగంగా గురువారం రోజున గోడిశెలపేట గ్రామంలో నిర్వహించిన డిఫెన్సివ్ డ్రైవింగ్ అవగాహన కార్యక్రమంలో ఎస్సై పి.ఉదయ్ కుమార్, నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సై పి.ఉదయ్ కుమార్,ఆఫ్ పోలీస్, మాట్లాడుతూ వాహనదారులు, ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు, ప్రజలు తప్పకుండా రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా హెల్మెట్ తప్పనిసరిగా ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదు, వేగ పరిమితులను పాటించడం, సీటు బెల్ట్ వినియోగం, మొబైల్ ఫోన్ వాడకాన్ని నివారించడం వంటి అంశాలపై వివరించారు. అలాగే డిఫెన్సివ్ డ్రైవింగ్ ద్వారా ప్రమాదాలను ఎలా నివారించవచ్చో, ఇతర వాహనదారులను గౌరవిస్తూ సురక్షితంగా ప్రయాణించాల్సిన అవసరాన్ని ప్రజలకు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామా సర్పంచ్ రాజేశం, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మాదిగ హక్కుల దండోరా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**పోస్టర్ ఆవిష్కరించిన రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగ**



**హైద్రాబాద్ ఫిబ్రవరి 26(చట్టం) :** మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగ పిలుపు మేరకు ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ ఎస్.ప్రసన్న కుమార్ మాదిగ, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ వెంకటరమణతో కలిసి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగ హక్కుల దండోరా ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ను గురువారం ఆవిష్కరించారు.అంతకుముందు డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో చల్లగుండ్ల శ్రీనివాస్ రావు ఆంధ్రప్రదేశ్ కమ్మ సంఘం ప్రధాన కార్యదర్శి,గోల్డ్ శ్రీనివాస్, బోయ.వెంకట రమణ మాదిగ మాట్లాడుతూ మాదిగ హక్కుల దండోరా ఆవిర్భావ దినోత్సవం 6 వ సంవత్సరం లోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా 27 ఫిబ్రవరి మధ్యాహ్నం1,గంటకు,భాషీర్ బాగ్,ప్రెస్ క్లబ్ లో జరుగుతున్న మాదిగ హక్కుల దండోరా సమావేశానికి అంబర్పేట్ నుండి భారీ ఎత్తున హజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రేణుక మాదిగ, మనోజ్ మాదిగ,దేవానంద్,కె. రమేష్ నాయక్,చిట్టెల. యాదగిరి మాదిగ,భాను ప్రసాద్,రంజిత్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వేదమంత్రోచ్చారణల మధ్య విగ్రహాల ప్రతిష్టాపన ఉత్సవం.



**పెగడపెల్లి ఫిబ్రవరి 26 ( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నామాపూర్ గ్రామంలో గత మూడు రోజులనుండి శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో విగ్రహాల ప్రతిష్టాపన ఉత్సవాలు వేదమంత్రోచ్చారణల మధ్యన కన్నుల పండుగగా ఉత్సవాలు జరిపారు. గురువారంయాగం నిర్వాహంచి గణపతి ఏడు ఫీట్ల పంచముఖ హనుమాన్ నవనగులు ద్వారపాలకులు బలిపిటలు విగ్రహ యంత్రం ప్రతిష్టాపన తిరుపతి నుండి వచ్చిన పదిమంది వేదపండితుల మధ్య గుడి పూజారులు దీరాజ్ ఆచార్య మురళి ఆచార్య చేతులమీదుగా విగ్రహల ప్రతిష్ట అంగరంగ కనుల పండువగా జరిగింది. ఏడు ఫీట్ల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహాన్ని చెకబండి,తిరుపతిరెడ్డి,ఉప్పుల కిషన్ రెడ్డి, దంపతులు గణపతి,విగ్రహాన్ని పిండి ప్రతాప్ రెడ్డి, కవిత,దంపతులు చేయించారు. గత మూడు రోజుల నుండి విగ్రహాల ప్రతిష్టాపన ఉత్సవాలు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కన్నుల పండుగగా భక్తులకు భక్తి సారాంశంతో కనులారా వీక్షించేందుకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీతారామాంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ గోపు వీరారెడ్డి, భక్తులు పరిసర గ్రామాల ప్రజలు గ్రామస్తులు యువకులు మహిళలు పాల్గొన్నారు.

# ఎండపల్లి మండలంలో విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షించిన డి ఈ డి ఛాత్రోపాధ్యాయులైనలు

**ఎండపల్లి ,ఫిబ్రవరి 26 చట్టం. :** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలో ప్రాథమిక పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి రాష్ట్ర వ్యాప్తంగా రెండవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న (ఎఫ్ ఎల్ ఎన్) ఫౌండేషనల్ లిటరసీ న్యూమరసీ సర్వే లో భాగంగా ఎండపల్లి మండల కేంద్రంలోనీ కోడిపుంజులపల్లె , మారేడుపల్లె ప్రాథమిక పాఠశాలలో 2వ తరగతి విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షించేందుకు డి ఈ డి ఛాత్రోపాధ్యాయులైన వైష్ణవి, ధనుశ్రీ గురువారం రోజు ఆయా పాఠశాలలు సందర్శించారు.ఈ సర్వే మొత్తం మూడు రోజుల పాటు నిర్వహణ జరుగుతుందని తెలిపినారు. వారితో పాటుగా ప్యానెల్ ఇన్స్పెక్షన్ సభ్యులు అయిన జయంత్, శ్రీనివాస్ కూడా విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండల విద్యాధికారి శ్రీ సముద్రాల హరికృష్ణ మాట్లాడుతూ మండలంలో పనిచేస్తున్నటువంటి సమస్త ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని, ఇంకా తొందరలో నిర్వహించ బోయే (ఎఫ్ఎల్ఎస్) ఫౌండేషన్ లెర్నింగ్ స్టడీ సర్వే లో కూడా మండలం ఉత్తమ ప్రదర్శన కనబరచాలని అందుకు తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జ్యోతి, స్వరూప ఉపాధ్యాయులు అరుణ, రమేష్ , సిఆర్పీ రాజారాణి లు పాల్గొన్నారు.





# మమతా బెనర్జీ కళ్లు తెరవాలి !

బెంగాల్లో సర్ ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో అక్కడ జ్యుడిషియల్ అధికారుల అజమాయిషీలో జరగాలని ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతోపాటే సర్ ప్రక్రియను అడ్డుకోరాదని మమతా బనర్జీకి సుప్రీం గట్టిగానే సూచించింది. నిజానికి సర్ ప్రక్రియ ద్వారా ఓట్లను సంస్కరించడం అవసరమే. తమిళనాట లక్షల్లో ఓట్లు తొలగించారు. గుజరాత్‌లోనూ తొలగించారు. ఇప్పుడు దక్షిణాదిలో కూడా సర్ ప్రక్రియ కొనసాగనుంది. ఈ క్రమంలో ఓట్లు తొలగింపు వల్ల ఎవరైనా తమ ఓటు నిజంగానే కోల్పోతే వారి పక్షాన ప్రభుత్వం పోరాడాలి. అంతే తప్ప అడ్డుకోవడం సరికాదు. ఇదేదో రాజ్యాంగ విఘాతం కలిగించారన్న రీతిలో ప్రచారం చేయడం విపక్షాలకు తగదు. ఎన్నికల కమిషన్ ఏం చేసినా, ఎలా చేసినా విమర్శించే విపక్ష స్థానంలో ఉన్న కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డిఎంకెపార్టీలు తీవ్రంగా అడ్డుపడు తున్నాయి. బ్యాలెట్ బాక్స్ లతో ఓటింగ్ విధానం ఎలక్ట్రానిక్ ఓటింగ్ పద్ధతికి మారాక కొన్ని ఎన్ని కల వరకూ బాగా నడిచిందని ప్రశంసలు ఇచ్చిన పార్టీలు ఇప్పుడు ఆ విధానం వల్ల తమకు నష్టం వాటిల్లుతోందని ఘోషిస్తున్నాయి. పార్టీ ఏదైనా తమకు ఓటింగ్ అనుకూలంగా రాకపోయి ఓటమిపాలైతే ఎలక్ట్రానిక్ ఓటింగ్ పక్రి యలో లోటుపాట్లు ఉన్నందునే తాము ఓడిపోయామని విమర్శలు గుప్పిస్తున్నారు. విపక్ష పార్టీలు తమ స్థానాలు మారినా విమర్శలకు వెనుకాడడం లేదు. 'సర్' పేరెత్తితేనే విపక్షాల్లో అదీ అతి ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ అపచారం జరిగిందని అంటున్నారు. ఇలా కాకుండా ఎక్కడైనా ఓట్ల తొలగింపుతో ఎవరైనా నష్టపోతే దానిని ఆధారంగా చేసుకుని పోరాడాలి. కానీ మొత్తం ప్రక్రియనే వ్యతిరేకించడం ద్వారా రాజ్యాంగాన్ని తృణీకరిస్తున్నాయని గుర్తించాలి. సుప్రీం ఇచ్చిన ఆదేశాలు లేదా సూచనలు ఆయా రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలి. ఇంకా సర్ ప్రక్రియను అప్రతిష్టపాలు చేయాలనే ఆలోచన నుంచి రాజకీయ పార్టీలు బయటపడాలి. ఎన్నికల కమిషన్ పై సవాల్ చేసిన కాంగ్రెస్ పార్టీ ఓట్ చోరీపై తమ నిరసన ధ్వనులను పెంచుతున్నాయి. ఒకపక్క ఎన్నికల కమిషన్ త్వరలో ఎన్నికలు జరిగే పశ్చిమబెంగాల్, తమిళ నాడు, కేరళ వంటి రాష్ట్రాలలో ఓటర్ల జాబితా విస్తృత సవరణ (సర్) కార్యక్రమాన్ని చేపట్టగా కాంగ్రెస్ అధ్యక్షు డు రాహుల్గాంధీ, 'ఓట్ చోరీ' ప్రచార కార్యక్రమాన్ని బహుళ ప్రచారం చేస్తున్నారు. బీహార్ ఎన్నికల్లో చతికిలపడినా ఓటరు జాబితా విషయంలో రాజీ పడేది లేదనే ధోరణిలో ముందుకు కదులుతున్నారు. బీహార్లో 'సర్' కార్యక్రమం చేపట్టినప్పుడు ఎన్నికల కమిషన్ను కాంగ్రెస్ పార్టీ విపరీ తంగా ఆరోపణలు గుప్పించింది. ఎన్నికల కమిషన్ తన ధోరణిలో తనప్రణాళిక ప్రకారం ఓటరు జాబితా సవరణ కార్యక్రమం చేపట్టింది. ఎన్నికలు సజావుగానే నడిపించింది. బీహార్లో అప్పటికే అధికారంలో ఉన్న పార్టీకే ప్రజలు పట్టం కట్టారు. అంటే విపక్షాల అభ్యంతరాలు ఎవరినీ కదిలించలేదన్నది సుస్పష్టం. అయినా కాంగ్రెస్ తదితర పక్షాలు తాము పట్టిన కుందేటికి మూడే కాళ్లన్న ధోరణిలో తమ పిడివాదంతో విమర్శలు గుప్పిస్తున్నాయి. ఓటు దొంగల కబంధ హస్తాల నుంచి భారత ప్రజాస్వామ్యాన్ని రక్షించే నినాదంతో కాంగ్రెస్ సంతకాల సేకరణ చేస్తోంది. బీహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ పార్టీ తన ఆలోచనలో మార్పు తెచ్చుకోగలదని అందరూ భావించారు. కానీ అలా జరుగలేదు. కనీసం ఆది నుంచీ ఒకే మాటమీద వ్యవహా రాన్ని నడిపిస్తున్నారు. బోగస్ ఓట్లను చేర్చడం, విపక్ష అనుకూల ఓటర్లను తొలగించడం, ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడడం వంటివి ఎన్నికల కమిషన్ భారతీయ జనతా పార్టీలు కలిసికట్టుగా వ్యవహరిస్తున్నాయన్నది కాంగ్రెస్ ఆరోపణలు. బిజెపి ఓటర్లకు ఆయా నియోజక వర్గాల్లో నగదు పంచుతున్నా చర్యలు తీసుకోకుండా, ఇసి సహకరిస్తోందని విపక్షాలు గట్టిగా నమ్ముతున్నాయి. తాజాగా పశ్చిమ బెంగాల్లో ఓటర్ల జాబితా సవరణ మొదలైంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఎన్నికల కమిషన్పై రుసరుసలాడుతున్నారు. దేశవ్యాప్తంగా ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఒక ఉద్దేశపూర్వక కుట్రగా అభివర్ణించారు. బీహార్ లో 'సర్' అమలులో విజయవంతమైన కార్యక్రమంగా రూపొందించి దేశవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాన్ని చేప ట్టేందుకు ఇసి నిర్ణయం తీసుకుందంటే అది ఎంతోమంచి కార్యక్రమమేననుకోవాలి. అయినా బిజెపియేతర ఇండియా కూటమిలు ప్రధానపక్షమైన కాంగ్రెస్ఎన్నికల కమిషన్ వివవరణలను ఆకళింపు చేసుకోలేకపోయింది. దానికితోడు దేశవ్యాప్త 'సర్' విచారణ కోసం నియమితులైన 16మంది బిఎల్ఎలు ఒత్తిడి వల్లనే మరణించారన్న వార్తలను ఆసరాగా చేసుకుని ఇసి ఒత్తిడిలపై కాంగ్రెస్ ధ్వజమెత్తింది. పశ్చిమ బంగలోని ధులగోరి, బిరాటి, న్యూటేన్ ఘుసురి వంటి ప్రాంతాల్లో ఎక్కువగా ఉండే బంగ్లా దేశీయులు ఓటర్ల జాబితా ఏరివేతలో తగు పత్రాలు చూపలేక అక్రమంగా వలస వచ్చినట్లు తేలినవారంతా ఇప్పుడు బంగ్లాదేశ్ దారిపట్టారు. ఇప్పుడీ కార్యక్రమం వలన పశ్చిమ బెంగాల్లో సంక్లిష్ట పరిస్థితులేర్పడ్డా యి. బంగ్లాదేశ్ నుంచి వచ్చి బెంగాల్లో ఉండేవారి పత్రా లను చూసే పనిని బిఎస్ఎఫ్ జవాన్లకు అప్పగించారు. వెనక్కివెళ్లే సమయంలోనూ వీరే వారిపత్రాలను పరిశీ లించి పోలీసులకు పంపాల్సి ఉంటుంది. ఈ పక్రియ ఎంతో కష్టమైనది. సుదీర్ఘమైనది. బంగ్లాదేశీయుల రివర్స్ మైగ్రే షన్తో బెంగాల్ పోలీసులు సతమత మవుతున్నారు. సరైన పత్రాలు లేనివారిని నిర్బంధించి జైల్లోపెట్టే పరిస్థితి ఉంది. నిజానికి బంగ్లాదేశీయులు పశ్చిమ బెంగాల్లో ప్రవేశించిన ప్పుడు దళారీల ద్వారా ఆధార్ కార్డులు రేషన్ కార్డులు, ఓటరు ఐడీలతో ప్రవేశించారు. ఇప్పుడు అలాంటి ఎన్నీ బయటపడి పత్రాలన్నీ నకిలీవని తేలుతున్నందున మమతా బెనర్జీ సిగ్గుపడాలి.

## ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

### వసలదారుల పట్ల అనుసరిస్తున్న విధానంపై కోర్టు ఆగ్రహం

**న్యూయార్క్,ఫిబ్రవరి26 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఆ దేశ న్యాయస్థానాల్లో వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ప్రపంచ దేశాలపై సుంకాల విషయాల ఇప్పటికే కోర్టు నుంచి వ్యతిరేక తీర్పు రాగా.. తాజాగా వలసదారుల విషయంలోనూ అదే అనుభవం ఎదురైంది. అక్రమ వలసదారులను వారికి సంబంధం లేని ఇతర దేశాలకు తరలించడాన్ని అక్కడి ఫెడరల్ కోర్టు తప్పుబట్టింది అక్రమ వలసదారుల విషయంలో ట్రంప్ కార్యవర్గం తీసుకున్న నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ మసాచుసెట్స్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి తీర్పునిచ్చారు. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులను టా÷–గ్గ÷ట్ చేసిన సంగతి తెలిసిందే. అక్రమ వలసదారులను అమెరికా నుంచి గ్వాటమాల, దక్షిణ సూడాన్, కోస్టారికా వంటి ఇతర దేశాలకు తరలించారు. దీంతో ఈ తరలింపు ముప్పును ఎదుర్కొంటున్న వలసదారులు కోర్టులో దావా వేశారు. దావాపై తాజాగా న్యాయస్థానంలో విచారణ జరిగింది. సరైన భద్రతా చర్యలు తీసుకోకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, తగిన సమయం ఇవ్వకుండా వారికి సంబంధం లేని వేరే దేశాలకు తరలించడం చట్ట విరుద్ధమని కోర్టు తీర్పునిచ్చింది (÷బిటసజీ ఇనీబీసబి తిపపతిణసజీబితినీని ఇజీబ). ట్రంప్ కార్యవర్గం నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు ట్రంప్ యంత్రాంగానికి 15 రోజుల సమయం ఇచ్చింది.


## ది కేరళ స్టోరీ విడుదలకు బ్రేక్

### సెన్సార్ బోర్డును తప్పపట్టిన హైకోర్టు

**తిరువనంతపురం,ఫిబ్రవరి26 :** సరిగ్గా విడుదలకు ఒక్కరోజు ముందు 'ది కేరళ స్టోరీ2' మూవీకి న్యాయపరంగా ఎదురుదెబ్బ తగిలింది. సినిమా ప్రచార చిత్రంలో కేరళను తప్పుగా చూపించారని, మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే అంశాలు ఉన్నాయని సామాజిక మాధ్యమాల వేదికగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సినిమా విడుదలపై స్టే విధించాలని, సెన్సార్ సర్టిఫికేషన్ రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై గురువారం రాష్ట్ర హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) తీరును హైకోర్టు తప్పుపట్టింది. సినిమా పునః పరిశీలించాల్సిందిగా జస్టిస్ కురియన్ థామస్ సీబీఎఫ్‌సీకి సూచించారు. అప్పటివరకూ సినిమా విడుదలపై స్టే విధిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. 2023లో వివాదాల నడుమ విడుదలైన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా ఈ సినిమా రూపొందింది. దీనికి కామాఖ్యా నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించగా విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించారు. ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా నటించారు. ప్రేమ మాయలో పడి కొందరు అమ్మాయిలు.. కన్నవాళ్లను ఎదురించి తమ ప్రియుడితోనే జీవితం అనుకుని దూరమవుతుంటారు. కానీ రోజులు గడుస్తున్నకొద్దీ ఆ ప్రేమే ఓ పెద్ద మోసమని తెలుసుకున్నాక దిక్కుతోచని పరిస్థితుల మధ్య ఎవరికీ చెప్పుకోలేని హింసని భరిస్తుంటారు. అలాంటి నిజజీవిత కథాంశంతో 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్' రూపొందింది. ఫిబ్రవరి 27న ఈ మూవీని విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కేరళ హైకోర్టు ఉత్తర్వులతో ప్రస్తుతం వాయిదా పడింది.

# ఇజ్రాయెల్-భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

- యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఎవోయూ
- ఏఐ, వ్యవసాయం తదితర రంగాల్లో ఒప్పందాలు
- ఇజ్రాయిల్ పర్యటనలో ప్రధాని మోడీ ప్రకటన
- త్వరలోనే ఇండియా వస్తానన్న నెతన్యాహు



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి26 :** ఇజ్రాయెల్–భారత్ మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరనుందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. అలాగే ఇజ్రాయెల్‌లో కూడా త్వరలో యూపీఐ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. యూపీఐ పేమెంట్స్‌తో పాటు ఏఐ, వ్యవసాయం తదితర రంగాల్లో ఒప్పందాలు కుదిరాయి. రెండు దేశాల మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరగనున్నట్టు ఇరు దేశాల ప్రధానులు సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. మొత్తం 27 రంగాల్లో పరస్పర సహకారానికి ఇరు దేశాలు అంగీకరించాయి. మరోవైపు గాజాపై ప్రధాని మోదీ మరోసారి భారత్ వైఖరిని స్పష్టం చేశారు. మానవత్వం ఎప్పుడూ సంఘర్షణకు బలికాకూడదని అన్నారు. ప్రస్తుతం శాంతి ప్రణాళిక ద్వారా ఓ ముందడుగు పడిందని, ఈ ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతుగా నిలుస్తుందని మోదీ హామీ ఇచ్చారు. ÷ూగా, త్వరలోనే భారత పర్యటనకు రావాల్సిందిగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహును ఆహ్వానించారు. అంతకు ముందు ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని నెతన్యాహు ప్రశంసించారు. ఆయన ప్రసంగం ప్రతి ఒక్కరినీ కదిలించిందని అన్నారు. భారత్‌కు రుణపడి ఉన్నామని అన్నారు. మోదీ తమకు స్నేహితుడు కంటే ఎక్కువని అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇజ్రాయెల్ పర్యటన రెండు దేశాల మధ్య సరికొత్త మైత్రికి నాంది పలికింది. విమానాశ్రయం నుంచి ఇజ్రాయెల్ పార్లమెంట్ వరకు మోడీకి లభించిన ఘన స్వాగతం ఈ పర్యటన ప్రాధాన్యతను చాటిచెప్పింది. పర్యటనలో భాగంగా నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తన వ్యక్తిగత విషయాన్ని ఒకటి పంచుకొని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు మాట్లాడుతూ.. తన భార్యతో తన మొదటి డేట్ ఒక భారతీయ రెస్టారెంట్‌లో జరిగిందని, ఆ భోజనం అద్భుతంగా ఉండటం వల్లే వారి బంధం బలపడిందని సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి తాను, తన పిల్లలు కూడా భారత్‌కు రుణపడి ఉంటామని ఆయన అనగానే ప్రధాని మోడీ నవ్వు ఆపుకోలేక పోయారు. భారతదేశంలోని అపారమైన ప్రతిభను, ఇజ్రాయెల్‌లోని సాంకేతిక పరిజ్ఞానాన్ని కలపడం ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చని ఇద్దరు నేతలు ఆకాంక్షించారు. ప్రధానంగా కచ్చితమైన వ్యవసాయం, సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఆవిష్కరణలు,
సాంకేతికత, అభివృద్ధికి సంబంధించి రెండు దేశాల మధ్య 16 కీలక అవగాహన ఒప్పందాలు జరిగాయి.
రెండు దేశాల మధ్య స్నేహాన్ని మరింత బలోపేతం చేసేందుకు త్వరలోనే భారత్‌లో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నేతలు నిర్ణయించారు. 'మా వ్యక్తిగత స్నేహం, ప్రభుత్వాల మధ్య సహకారం, ప్రజల మధ్య అనుబంధం నానాటికీ బలపడుతోంది' అని నెతన్యాహు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. దీనిని కొనసాగించేందుకు సాధ్యమైనంత త్వరగా భారతదేశంలో ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పర్యటన కేవలం దౌత్యపరమైన ఒప్పందాలకు మాత్రమే పరిమితం కాకుండా, ఇద్దరు దేశాధినేతల మధ్య ఉన్న బలమైన వ్యక్తిగత స్నేహాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది.
------

# తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం

- పేదల ఇళ్లు కూల్చిన దుర్మార్గులు
- ముగ్గురు మంత్రుల పన్నాగం ఇది
- అసెంబ్లీలో మీ పక్షాన పోరాడుతాం
- కోర్టుల్లో పైసా ఖర్చు లేకుండా నిలబడతాం
- వెలుగుమట్ల బాధితులను పరామర్శించిన కెటిఆర్



**ఖమ్మం,ఫిబ్రవరి26 :** తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం రాజ్యమేలుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో తొలగించిన ఆక్రమణలను కేటీఆర్ పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. వచ్చే నెల16వ తేదీ నుంచి అసెంబ్లీ ప్రారంభ మవుతుందని ఖమ్మం ప్రజల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తామని అన్నారు. మీ అందరికీ న్యాయం జరిగేవరకూ మీ పక్షాన ప్రభుత్వంపై పోరాడతామని చెప్పుకొచ్చారు. తాము అధికారంలోకి రాగానే మీ అందరికీ ఇదే స్థలంలో ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని కేటీఆర్ భరోసా కల్పించారు. అందరూ ధైర్యంగా ఉండాలని అంటూ బాధితులకు కేటీఆర్ మాటిచ్చారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వరకు ఎక్కడ చూసినా కూల్చివేతలేనని ఆరోపించారు. ఖమ్మంలో కూల్చివేసిన కాలనీ చూశానని.. ముగ్గురు మంత్రులకు 60 ఎకరాల మీద కన్నుబడిందని ఆక్షేపించారు. ముగ్గురు మంత్రులు కలిసికట్టుగా ఈ దుర్మార్గం చేశారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎవరికీ తాము అన్యాయం చేయలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. అందరూ ధైర్యంగా ఉండాలని.. మీ అందరికీ అదే ప్రాంతంలో అక్కడే ఇళ్ల స్థలాలు ఇల్లు ఇస్తామని మాటిచ్చారు. ఇక్కడి వారందరికీ అండగా నిలబడాలని తాను వచ్చానని చెప్పుకొచ్చారు. ఇళ్ల కూల్చివేతపై కోర్టుకి కూడా వెళ్దామని.. మీకెవరికీ ఒక రూపాయి ఖర్చు లేకుండా మీ తరపున తమ లీగల్ టీం పోరాడుతుందని మాజీమంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పేదలు ఎంతో కష్టపడి కట్టుకున్నఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్లతో కూల్చివేస్తున్న సంగతి తెలిసిందే. రేవంత్ సర్కార్ కనికరం లేకుండా ఖమ్మం అర్బన్ వెలుగుమట్ల భూదాన్ భూముల్లో పేదల ఇళ్లను నేలమట్టం చేస్తోంది. ఈ క్రమంలో వారికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులను కలిశారు. ఇళ్లు కోల్పోయిన వెలుగు మట్ట బాధితులను కేటీఆర్, పార్టీ నేతలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మిమ్మల్ని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుస్తరు. మీకు అది చేస్తం.. ఇది చేస్తం.. అది చేస్తమని.. మీ 900 కుటుంబాల్లో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తాడు. మీరు ఐక్యంగా ఉంటేనే విజయం సాధిస్తరు.. లేదంటే వీళ్లు ఏం చేస్తరు. ఏ 100 మందితో వేలి ముద్రలు తీసుకొని మీకు అన్నేన్నో ఇస్తరు.. కేసీఆర్ 2000 డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టించారు. వాటిలో కొన్ని మిగులున్నయట. ఆ ఇండ్లలో కొంతమందికిస్తమని చెప్పి వారిని లాక్కెళతారని కేటీఆర్ హెచ్చరించారు. ఓపీడీఆర్ వాళ్లు గతంలో ఎప్పుడో చేసిన పని. పాపం వాళ్లేం తప్పు చేయలేదు.. మీకు పట్టాలిప్పించారు. వాళు తప్పు చేసిందేమి లేదు.. ఇప్పుడు వాళ్లను పట్టుకుని ప్రభుత్వం నానా మాటలు అంటోంది. ల్యాండ్ మాఫియానట.. ఎవడమ్మా ల్యాండ్ మాఫియా.. ఎవడైతే ఇవాళ మీ చుట్టూ వందల ఎకరాలు కొన్నాడో.. ఎవడైతే పేదవాడి ఇల్లు కట్టుకున్నడో వాడు మాఫియానా..? మీకు జరిగిన కష్టం.. మీ ఏడుపులు రాష్ట్రం మొత్తం చూసింది. మీ పిల్లలు, మీరు పడుతున్న అవస్థలు చూసే కేసీఆర్
సార్ మమ్మల్ని పంపించారు. దయచేసి ధైర్యంగా ఉండండి.. మీకు అన్ని రకాలుగా అండగా అజయ్ అన్న, మా ఎంపీ గాయత్రి రవిచంద్ర ఉంటారన్నారు. ఏ తప్పూ జరుగకపోతే ఆర్డీవోను ఎందుకు వెంటనే బదిలీ చేశారు. సమాధానం చెప్పాలే ప్రభుత్వం. మంత్రులు తప్పు చేయకపోతే.. నిజంగా ధైర్యముంటే వాల్లెందుకు రావడం లేదు.. ఇక్కడికి.. వాళ్లొచ్చి మాట్లాడాలి కదా.. అందుకే మీరు ధైర్యంగా ఉండండి. మీ వెంబడి కేసీఆర్ అన్న ఉన్నడు.. కేటీఆర్ అన్న ఉన్నడు. మేమంతా ఉన్నం. ఎట్టి పరిస్థితుల్లో మీకు న్యాయం జరిగేదాకా మేము అండగా ఉంటామని హామీనిచ్చారు. మీకు అన్ని కాగితాలున్నాయి.. కోర్టుకు పోదాం.. కోర్టుకు కూడా మీరు రూపాయి ఖర్చు పెట్టుకునే పని లేదు. పార్టీ తరపున మేం కొట్లాడుతాం.. మీకు మేం అండగా ఉంటాం. మళ్లీ వస్తాం మిమ్మల్ని కాపాడుకుంటాం. న్యాయపరంగా పట్టాలిప్పించే ప్రయత్నం చేస్తాం. దయచేసి ఐకమత్యాన్ని కోల్పోకండి.. సంఘటితంగా, ఒక్కటిగా ఉండండిని సూచించారు.

## సిఎం రేవంత్‌లో హిమాచల్ మంత్రి భేటీ

హైదరాబాద్,ఫిబ్రవరి26 :హిమాచల్ ప్రదేశ్ మంత్రి విక్రమాదిత్య సింగ్ హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసారు. మంత్రిని సిఎం సాదరంగా స్వాగతించి సన్మానించారు.

## బోయినపల్లి ప్రభుత్వ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం.

- ఈ నెల 28 న ముగుయనున్న గడువు
- వివిధ ప్రాంతాల నుండి మోడల్ స్కూల్ వరకు RTC బస్సు సౌకర్యం. ........
- ప్రిన్సిపాల్ ఎరువ రఘునాథ్



**బోయిన్ పల్లి మండలం / ఫిబ్రవరి 26 ,(చట్టం న్యూస్ ) :** తెలంగాణ మోడల్ స్కూల్ బోయినపల్లి లో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు గల ప్రవేశ పరీక్ష కొరకై ఈ ఫిబ్రవరి 28 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రఘునాథ్ గారు ఒక ప్రకటనలో తెలిపారు.

RTC బస్సు సౌకర్యం :

1) కరీంనగర్ నుండి కోదురుపాక మీదుగా,మోడల్ స్కూల్ వరకు.
2) కరీంనగర్ నుండి బావుపేట ,విలాసాగర్ మీదుగా , మోడల్ స్కూల్ నుండి అనంతపల్లి వరకు
3) వేములవాడ నుండి అయ్యోరుపల్లి, రత్నంపేట, రామన్నపేట,దేశాయిపల్లి మీదుగా మోడల్ స్కూల్ నుండి గంగాధర వరకు.
4) వేములవాడ నుండి స్తంభంపల్లి మీదుగా మోడల్ స్కూల్ వరకు మరియు స్కూల్ నుండి గంగాధర వరకు

బస్సుల సౌకర్యం కలదు.
అడ్మిషన్ల కొరకై ఓపెన్ కేటగిరి విద్యార్థులకు 200 రూపాయలు. దీజ,ాజ, ొ్రూఎజ,. మరియు జుఔూ విద్యార్థులకు 125 రూపాయలను చెల్లించి వశ్రీఖఅస్త్రుఋఎం.ఎస్త్రస్త్ర.స్త్రశీజ. ఱఅ అనే వెబ్ సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోగలరు. ?

## నీటి సమస్య తీర్చండి మహాప్రభో, కాలనీవాసులు ఆవేదన




**నార్వల ఫిబ్రవరి 26, (చట్టం) న్యూస్ :** నార్వల మండలం నడిమి దొడ్డి గ్రామంలో గత కొన్ని నెలలుగా అంబేద్కర్ కాలనీవాసులకు పంచాయితీ నీళ్లు రాక చుట్టుపక్కల ఉన్న తోటల దగ్గరకు వెళ్లి నీళ్లు తెచ్చుకొని దాహం తీర్చుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని మహిళలు, వృద్ధులు ,పిల్లలు తీవ్ర ఇబ్బంది పడుతున్నాము అదేవిధంగా త్రాగునీరు మరియు వాడుకొనుటకు గొర్రెలు మేకలు పశువులకు చాలా కష్టంగా ఉన్నది అని అంబేద్కర్ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులకు పాలకులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు సమర్పించిన మా సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నది తిరిగి తిరిగి చెప్పులు అరగడం తప్ప సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. అదేవిధంగా పంచాయతీ సెక్రెటరీ గారు మా కాలనీ నందు పెన్షన్ పంచడానికి తప్ప మా కాలనీలో నీళ్లు వస్తున్నాయా, వీధిలైట్లు పడుతున్నాయా, డ్రైనేజీ కాల శుభ్రం చేస్తున్నారా ఇవన్నీ ఏమీ పట్టవు ఆమె ఒకటో తేదీ మాత్రం పెన్షన్ ఇచ్చి అలా వచ్చి ఇలా వెళ్ళిపోతుంది అని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత మండల అధికారులు ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి మా కాలనీ దాహం తీర్చాలని కోరుతున్నామని తెలియజేశారు , లేని పక్షాన కాలనీ వాసులు కలుపుకొని ధర్నా చేస్తామని తెలియజేశారు



# నగదు రహిత ఆరోగ్య పథకంలో ఉపాధ్యాయుల వాటా బేసిక్ పేలో 1.5 నుండి 0.5 శాతం కు తగ్గించాలి

- తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ డిమాండ్
- కస్తూరిబా,మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు కూడా ఈ పథకాన్ని అమలు చేయాలి.
- సి. పి. ఎస్.ఉద్యోగుల ఉద్యోగ విరమణ అనంతరం ఈ పథక అమలు పై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలి
- డిఏలు,పిఆర్సీఇవ్వక పోగా ఆరోగ్య పథకానికి ఉద్యోగస్తుల జీతం లో వాటా రూపంలో అధిక కోతలా.??
- ఆర్థికంగా నష్టపోతున్న ఉద్యోగులు ఉపాధ్యాయులు- టి పి టి ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి నన్నపురాజు నరసింహరాజు



**మహబూబాబాద్ జిల్లా చట్టం న్యూస్ కేసముద్రం :** ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన నగదు రహిత ఆరోగ్య పథకం నిజంగా అభినందనీయం అయినప్పటికీ ఈ పథకం అమలుకై ఉద్యోగస్తుల జీతంలో మూల ధనం లో 1.5 శాతం ప్రతి నెల కోత విధించడం సమంజసం కాదని, ప్రభుత్వం తక్షణమే పునః సమీక్ష జరిపి నిమిత్తమాత్రంగా 0.5 శాతం ఉండేలా చర్య తీసుకోవాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో టి పి టి ఎఫ్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ నెతృత్వంలో కేసముద్రం( వి )ప్రాథమిక పాఠశాలలో , ప్రధాన కార్యదర్శి నన్నపురాజు నరసింహ రాజు నేతృత్వంలో అర్పణపల్లి పాఠశాలలో ఈ విషయమై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సురేందర్ మాట్లాడుతూ ఉద్యోగ,ఉపాధ్యాయులు ప్రభుత్వంలో భాగమేనని, వీరి సంక్షేమం చూడాల్సిన పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని,వీరికి వైద్యాన్ని ఉచితంగా అందించాల్సి ఉందని , కానీ ఉద్యోగుల నుండి ప్రతి నెల వారి వాటా రూపంలో అధికం గా జీతం లో కోత విధించడం అన్యాయమేనన్నారు. ఇది ప్రైవేటు హెల్త్ ఇన్సూరెన్స్ చేసినట్లుగానే ఉందని అభిప్రాయపడ్డారు.

అంతే కాదు పెన్షన్ లేని ( సి పి ఎస్ ) ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ అనంతరం వారికి పెన్షన్ రానందున ఏ విధంగా ఈ నగదు రహిత వైద్యాన్ని అందిస్తారో స్పష్టత లేదన్నారు. వారి ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ఏ విధంగా హామీ ఇస్తుంది? అని ఆయన ప్రశ్నించారు.

ఇది కేవలం ఆర్థిక అంశం మాత్రమే కాదు .ఉద్యోగుల భవిష్యత్తు భద్రత, కుటుంబాల సంక్షేమం కూడా ఇందులో భాగమేనని అన్నారు. అలాగే ఈ పథకాన్ని కస్తూరిబా, మోడల్ స్కూల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కూడా వర్తింపచేయాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు వీసం నర్సయ్య, ఊట్కూరి ప్రణయ్ కుమార్, అప్పాల నాగరాజు, ఉపాధ్యాయులు భూక్య శ్రీను, విజయ్, సురేష్ కుమార్,రమాదేవి, సోమ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# తాత జ్ఞాపకర్థం ... సేవా మార్గంలో" వేం "మనవళ్లు

- అర్పణపల్లి గ్రామంలో సేవ కార్యక్రమం లో వేం మనవళ్ళు
- అర్పణపల్లి, కిష్టపురం తండాలో రూ.40 వేల విలువైన బల్లల పంపిణీ
- వేం పురుషోత్తం రెడ్డి స్మారకార్థం ఆదర్శ కార్యక్రమం



**మహబూబాబాద్ జిల్లా చట్టం న్యూస్ కేసముద్రం :** కేసముద్రం మండలము అర్పణపల్లి లో పెద్దల జ్ఞాపకాన్ని కేవలం సంస్మరణలకు పరిమితం చేయకుండా, సమాజానికి ఉపయోగపడే విధంగా నిలబెట్టిన ఒక ఆదర్శ ఘటన అర్పణపల్లి గ్రామంలో వెలుగుచూసింది. గ్రామానికి చెందిన వేం పురుషోత్తం రెడ్డి స్మారకార్థంగా ఆయన మనవళ్లు అర్ణవ్ కృష్ణ రెడ్డి, అవ్యాన్ రెడ్డి కలిసి సుమారు రూ.40 000 విలువైన బల్లలను అర్పణపల్లి గ్రామ స్మశానం వాటికలో మరియు కిష్టపురం తండాలో ఏర్పాటు చేశారు.స్మశాన వాటికలో అవసరాన్ని గుర్తించి...గ్రామ స్మశానం వాటికకు వచ్చే కుటుంబ సభ్యులు, బంధువులు నిలబడి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు విశ్రాంతి తీసుకునేందుకు సరైన సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని కుటుంబ సభ్యులు గమనించారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో బల్లలను ఏర్పాటు చేశారు. అలాగే కిష్టపురం తండాలో,గ్రామం పంచాయతీ లో ప్రజలకు ఉపయోగపడేలా బల్లలు అందజేశారు. అక్కడి ప్రజలు ఈ సేవా కార్యక్రమాన్ని హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

## తాత చూపిన మార్గం... మనవళ్లలో సేవాభావం

వేం పురుషోత్తం రెడ్డి గ్రామంలో సామాజిక సేవ, అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతుగా నిలిచిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. గ్రామాభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం పట్ల ఎప్పుడూ చొరవ చూపేవారని గ్రామ పెద్దలు గుర్తుచేశారు.

ఆయన స్ఫూర్తితోనే మనవళ్లు అర్ణవ్ కృష్ణ రెడ్డి, అవ్యాన్ రెడ్డి ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారని కుటుంబ సభ్యులు తెలిపారు. "పెద్దల జ్ఞాపకం నిలిచిపోవాలంటే సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలి" అన్న ఆలోచనతో ఈ కార్యక్రమం నిర్వహించామని వారు పేర్కొన్నారు.గ్రామ ప్రజల ప్రశంసలు బల్లల పంపిణీ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, మహిళా సంఘాలు పాలుగోన్నారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, "వేం మనవళ్లు "సేవా కార్యక్రమాల్లో ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు.స్మశాన వాటికలో ఏర్పాటు చేసిన బల్లలు సందర్శకులకు సౌకర్యాన్ని కల్పించనున్నాయి. అర్పణపల్లి గ్రామం,కిష్టపురం తండా ప్రజలు కూడా ఈ సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

## వేం మనవాళ్ళు ఆదర్శం

ఈ కార్యక్రమం ద్వారా చిన్నారులు ఒక స్పష్టమైన సందేశం అందించారు -- పెద్దల జ్ఞాపకార్థం చేసే సేవలు సమాజానికి ఉపయోగపడేలా ఉంటేనే ఆ జ్ఞాపకం చిరస్థాయిగా నిలుస్తుంది. 40 వేల విలువైన బల్లల పంపిణీ ద్వారా అర్పణపల్లి గ్రామంలో ఒక మంచి ఆలోచనకు శ్రీకారం చుట్టిన ఈ చిన్నారులు అందరికీ ఆదర్శంగా నిలిచారు. తాత జ్ఞాపకం...సేవగా మారిన సందర్భంఅర్పణపల్లి గ్రామంలో జరిగిన ఈ సేవా కార్యక్రమం కుటుంబ బంధాలు, సంస్కారం, సామాజిక బాధ్యతలను ప్రతిబింబిస్తూ మండల స్థాయి లో ప్రశంసలు అందుకుశీటున్నారు.

# పసిపాప మృతికి కుల హింస కారణం...

- నిందితులను వెంటనే అరెస్టు చేయాలి..
- అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలి..
- ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరిపి కఠిన శిక్ష విధించాలి...
- తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి పున్నం సారయ్య.




**మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, ఫిబ్రవరి 26 (చట్టం న్యూస్) :**
నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతర సందర్భంగా చోటుచేసుకున్న దారుణ ఘటన కలకలం రేపుతోంది. కులవివక్షతో రెచ్చిపోయిన పెత్తందారుల దాడిలో రెండు నెలల పసిపాప ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. ఈ ఘటనపై ఖండిస్తూ తొర్రూరులో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి బస్టాండ్ సమీపంలోని హరిపిరాలకు వెళ్లే రహదారి వరకు భారీ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ తెలంగాణ రజక వృత్తిదారుల రజక యూత్ అధ్యక్షుడు చింతల రాజు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మహబూబాబాద్ జిల్లా రజక వృత్తిదారుల సంఘం కార్యదర్శి పున్నం సారయ్య మాట్లాడుతూ ...ఈ నెల 18న మల్లన్న స్వామి జాతరకు వెళ్లిన కీర్తి కుటుంబంపై అదే గ్రామానికి చెందిన కొందరు పెత్తందారులు విచక్షణారహితంగా దాడి చేశారని ఆరోపించారు. దాడిలో రెండు నెలల శిశువు మృతిచెందగా, గణేష్ తీవ్రంగా గాయపడ్డారని, మహిళలపై అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ ఘటనలో శ్రీనివాస్ రెడ్డి, తుక్కరం రెడ్డి, సర్పంచ్ సతీష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కన్నెరెడ్డి, నరేష్ తదితరులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటివరకు బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోవడం అనుమానాలకు తావిస్తోందని, కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకుని నిందితులపై హత్యా కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి త్వరితగతిన విచారణ పూర్తి చేసి కఠిన శిక్ష విధించాలని ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబానికి పోలీసు రక్షణ కల్పించాలని కూడా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తోరూర్ మండల కార్యదర్శి పొడగంటి శేఖర్, చేతివృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్, మడిపెద్ది సమ్మక్క ,వడ్డేపల్లి రామక్క , చింతల ఉమా, మడి పెద్ది రేణుక,మడిపెద్ది మల్లేష్ ,పైండ్ల రాజేష్, చింతల మల్లేష్ ,గొల్లపల్లి వెంకటేష్ , చింతల ఉపేందర్, పోరండ్ల సురేష్ , చింతల మధు, పైండ్ల సోమన్న,పైండ్ల సంపత్ ,మడిపెద్ది కార్తీక్, పైండ్ల వినయ్, ఓరుగంటి ప్రవీణ్ ,మడి పెద్ది ప్రవీణ్, లొంక రాజ్ కుమార్,పైండ్ల సుధాకర్,చింతల నాగన్న,సట్ల శ్రావణ్ ,సట్ల చంటి,చింతల వినయ్, చింతల సోమన్న,పైండ్ల వెంకటయ్య, మరిపెద్ది రాజేష్,ఓరుగంటి కార్తీక్,పోరండ్ల సందీప్, పైండ్ల విజయ్, బిక్షపతి (ప్లంబర్),కొండ్రాతి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మహోన్నత స్వాతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్

**బోయిన్ పల్లి మండలం / ఫిబ్రవరి 26 ,(చట్టం న్యూస్) :** బోయిన్ పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బహుమతుల అందజేత ; నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యం లో భారత దేశ స్వాతంత్ర ఉద్యమం లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్ర అనే అంశం పై వ్యాస రచన పోటీ నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర ఉద్యమంలో ఎంతో గాను కృషి చేసిన మహోన్నత మైన వ్యక్తి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు.నేతాజీ సుభాష్ చంద్రబోస్ ను నేటి తరం విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్ లో ఎంచుకున్న లక్ష్యాల దిశగా ముందుకు వెళ్లాలని తెలిపారు.నేతాజీ సుభాష్ చంద్ర బోస్ ఆలోచన విధానాన్ని ప్రతి ఒక్కరు ముందుకు తీసుకు వెళ్ళాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల జిల్లా అధ్యక్షులు అమిరీ శెట్టి భూమి రెడ్డి, నేతాజీ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు ఏడ పల్లి వంశీ తదితరులు పాల్గొన్నారు.



# వృద్ధాశ్రయం తనిఖీ..!



**కర్నూలు, చట్టంన్యూస్ (26 ఫిబ్రవరి 2026):** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మద్దూర్ నగర్ నందు గల పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని మరియు అమ్మ వృద్ధుల శరణాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబందించిన రిజిస్టర్ లను పరిశీలించి అక్కడి సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించారు.అక్కడి వారిని అడిగి వారికీ అందించే భోజన, వసతి, వైద్య సదుపాయలను గురించి తెలుసు కొని సంతృప్తి వక్తం చేసారు. వృద్ధులకు నిరాశ్రయులకు ఏవైనా సమస్యలుంటే లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ నెంబర్ 15100కు కాల్ చేస్తే వారి చట్ట పరమైన సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యాయ వాది రాంపుల్లయ్య, వసతి గృహ నిర్వాహకురాలు శకుంతల తదితరులు పాల్గొనారు.



# వికసిత్ భారత్ 2026 పోస్టర్ రిలీజ్ చేసిన సెంట్రల్ మినిస్టర్ బండి సంజయ్




**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఫిబ్రవరి 26 ,(చట్టం బ్యూరో ) :** వికసిద్భారత్ కరీంనగర్ జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ 2026 పోటీలకు గాను పోస్టర్ని సెంట్రల్ మినిస్టర్ బండి సంజయ్ గారు రిలీజ్ చేశారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించి ఎమర్జెన్సీ పై తమ అభిప్రాయాలను ఆలోచనలను రాజ్యాంగబద్ధంగా ఏర్పడే పరిస్థితులను సవివరంగా వ్యక్తపరచాలని విద్యార్థులను ఉద్దేశించి కోరారు. వికసిద్భారత్ 2026 జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీలను 18 నుండి 25 సంవత్సరాల వయసు గల యువతి యువకులకు "50 ఇయర్స్ ఆఫ్ ఎమర్జెన్సీ : లెసన్స్ ఫర్ ఇండియన్ డెమోక్రసీ" అనే విషయంపై మూడు నిమిషాల పాటు హిందీ ,ఇంగ్లీష్ ,తెలుగు భాషలలో మాట్లాడడానికి అవకాశం కల్పించారు. ఈ జిల్లాస్థాయి పోటీలకు ఎస్ఆర్ఆర్ గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వేదికగా ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 28 ఫిబ్రవరి 2026 న ఉదయం 9 గంటల నుండి 6 గంటల వరకు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె రామకృష్ణ గారు తెలిపారు. ఈ పోటీలో పాల్గొనేవారు ముందుగా మై భారత్ పోర్టల్ లో విక సిద్ భారత్ ఈవెంట్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి అన్నారు. టిజిసి జిటిఏ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ గత సంవత్సరం మాదిరిగానే విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను నిస్సంకోచంగా వ్యక్తపరచి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మేరా యువ భారత్ జిల్లా అధికారి ఎం వెంకట రాంబాబు గారు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో విద్యార్థులు అత్యధిక సంఖ్యలో పాల్గొని కరీంనగర్ జిల్లా పేరు ప్రఖ్యాతులను జాతీయ స్థాయి వరకు తీసుకెళ్లేలా తమ ప్రతిభను ప్రదర్శించాలి అన్నారు. విద్యార్థులంతా నిస్సంకోచంగా తమ అభిప్రాయాలను వ్యక్తపరచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సి పల్స్ శ్రీ పి.నితిన్ పాఠక్, శ్రీ టి. రాజయ్య, మరియు వికసిత్ భారత్ జిల్లా స్థాయి పోటీల సమన్వయకర్త బి. ఎలిజబెత్ రాణి అధ్యాపకులు , ఎన్ఎస్ఎస్ పిఓలు శ్రీనివాస్ రెడ్డి, సత్య ప్రకాష్ ,డాక్టర్ కే అర్జున్, వెంకటేశ్వర్లు ,రాజేందర్ రాజేష్ తదితర అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# వందేళ్ళ కమ్యూనిస్ట్ మహాసభని జయప్రదం చేయండి.

**CPI(ML) న్యూడెమోక్రసీ కేసముద్రం మండల కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ.**



**మహబూబాబాద్ జిల్లా చట్టం న్యూస్ కేసముద్రం :** ఫిబ్రవరి 27 న హైదరాబాద్ లో సుందరయ్య విజ్ఞానకేంద్రం లో కమ్యూనిస్ట్ మహాసభ జరిగి వంద సంవత్సరాలు పూర్తి అయినా సందర్భంగా ఎజూఅ(ఎశ్రీ)న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సభ ను జయప్రదం చేయాలనీ కోరుతూ కేసముద్రంలో పోస్టర్ ఆవిష్కరణ చెయ్యడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఐ( ఎంఎల్ ) డెమోక్రసీ పార్టీ మహబూబాబాద్ డివిజన్ నాయకుడు బట్టు నాగేశ్వరరావుమాట్లాడుతూ భారతదేశం ఒక అర్ధ వలస, అర్ధ బుస్వామ్య వ్యవస్థ అని, దీనిని కూల్చివేసి నూతన వ్యవస్థ ఏర్పాటు చేయడం కోసం విప్లవ పందా మార్గం లో కమ్యూనిస్ట్ నాయకులు అందరూ కలిసి నూతన నాయకత్వం ఏర్పాటు చేసుకోవడానికి ఒక మహాసభ ఏర్పాటు చేసారు అని, ఆ మహాసభ ఏర్పడి వందేళ్ళ పూర్తి అయినా సందర్భంగా హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో సభను న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తుందని, దీనిని విజయవంతం చేయాలనీ బట్టు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల నాయకులు మునిగంటి సుధాకర్ ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి శివారపు శ్రీధర్ , ఐఎఫ్టియు జిల్లా నాయకులు మిట్టగడుపుల వెంకన్న, హమాలి అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు కేసముద్రం పట్టణ అధ్యక్షులు బండి రాజు, నాయకులు పి శ్రీను, ఎస్ సంజీవ, ఆదినారాయణ, సురేష్, ముత్యాల ఉపేందర్,తదితరులు పాల్గొన్నారు.

చట్టం సాహితీ లోకం 95814 19999

## దేవుడి ది ఏ కులం..?



చెప్పుకోవడానికే సమానత్వం
మురిచిపోవడానికే మానవత్వం

కులాలు లేవు మతాలు లేవని
పెదాలపై తీయని మాటల మంత్రాలు

వల్లే వేసే రాజకీయ రాకాసురులారా
ఓసారి కళ్ళు తెరిచి కళ్ళారా చూడండి

కులాల కంపులో కుళ్ళినంత కాలము
కర్కశ హృదయాలు వున్నంత కాలము

మతాల మత్తులో మునిగినంత కాలము
మనసు లో మానవత్వం లేనంత కాలము

ఏ దేవుడు ఏమి చేయ లేడు
ఈ మానవుడు ఎప్పటికి మారడు...

దేవుడు దృతరాష్ట్రుడైన వేళ
గాంధారి కళ్ళకు గంతలు విప్పనంత వరకు

కౌరవ సభ మూగబోయిన సమయం లో
సభ్యసమాజం సిగ్గుతో
తలదించుకోవాల్సిదేగా?

దేవుడు ఒక్కడే అని చెప్పే
కుహనా లౌకికవాదులారా

నా కులమదని, నా మతమదని
ఏనాడైనా ఏ దేవుడైన చెప్పినాడా..?

పసిపిల్లలు దేవునితో సమాన మంటారు
పసిపిల్లను చంపడమంటే దేవున్ని చంపడం
కాదా..!

దైవ దర్శనానికి కులం అడ్డువచ్చిందంట
మరి ఆ దేవుడిది ఏ కులం..?

దేవుడికి కులం లేదని
మనందరం దైవ"కుల" మని చెప్పలేమా...!

రచన:- వేనాప
జి.ప.ఉ.పా.గుడిబండ
కోదాడ 98484 32533.

చట్టం సాహితీ లోకం 95814 19999

## ముక్కంటి నను బ్రోవరా



తనువిది నిత్తెమంచు భవుదండ మొనర్చక పాపినైతి నో
యనఘ మహానుభావ భవ హైమవతీశ్వర మోక్షదాయకా
నినుగన నేరలేరుగద నిక్కము వెన్నుడు వేదశాస్త్రముల్
గొనకొని నిన్ను గొల్చెదను గోర్కులు దీర్చర మల్లికార్జునా

లోకములెల్లదాటి పలులోకము లందున నిన్నుగానకే
నాక సురాధిపద్విజులు నర్తనమన్న నుతింతు రుబ్బియున్
లోకుల గాచినట్టి హరరుద్ర మహేశ్వర లోకరక్షకా
మాకులమందు నిన్ను పరమాత్మగ నెంతుము మల్లికార్జునా

హోమము హవ్యవాహనము హోమపు ద్రవ్యము హోమ భోక్తమున్
ధూమము ధూపదీపములు తోయము పత్రము పండ్లుపూవులున్
నీమము హోమకర్తవును నిష్ఠయు స్వామియు కామితార్థమున్
నామది నిండినావు నయనాయుధ బ్రోవర మల్లికార్జునా

భక్తపరీక్షజేయ బలుభంగుల రూపము దాల్చుటేలకో
యుక్తి గిరాతభిల్లునిగ, నూరక రూపములేల శంకరా
శక్తిని భక్తిముక్తినిడ సాధనసవ్యముగా నొసంగుచో
రక్తి మహత్తరార్తి పరరాజ్యము జూపవొ మల్లికార్జునా

మానస గోచరుణ్ణి హరు మారరిపున్ మిహిరాణు డండయై
మానసమందునిల్పి పరమార్థము మాయల చెంచురాయడే
మానస పంకమూడ్చి విషమాక్షుడు మారుని మాడ్చి పార్వతీ
మానిని గొన్నశంభు బలుమారులు మ్రొక్కెద మల్లికార్జునా

రచన::శంకర్ జీ డబ్బికార్
ఊరు:: ఇబ్రాహీంపట్నం రంగారెడ్డి
చరవాణి::9160297956

చట్టం సాహితీ లోకం 95814 19999

## ఏకాంత వేళలో...

( ఆత్మదర్పణం )
ఏకాంతంగా ఉండే వేళ
నిన్ను నువ్వు పరిశీలించుకో!
మాట, మనసు, ఆచరణ
ఎలా ఉన్నాయో సరి చూసుకో!




చూసిందంతా నిజమేనా?
చేసిందంతా మంచేనా? తెలుసుకో!
కళ్ళు మూసుకుని ముందుకు పోక
ఆగి ఒక్కసారి వెనక్కి చూసుకో!

అంతరాత్మ భాషని, ఘోషని
ఒక్కసారైనా పట్టించుకో!
తిరస్కార భావంతో చూడక
అనురాగ భావంతో అర్థం చేసుకో!

అద్దం ముందు నిలబడి
ఆత్మసాక్షాత్కారం చేసుకో!
అంతరంగంలోకి అవలోకనం చేసి
నీ ప్రతీ చర్యని ప్రశ్నించుకో!

సావధాన చిత్తంతో యోచించి
సర్దుబాటుకు అవకాశాలు ఎంచుకో!
సావకాశంగా నిన్ను నువ్వు గ్రహించి
ఆత్మదర్పణంలో అందంగా వెలిగిపో!

E.V.V.S. వర ప్రసాద్
కవి, తెలుగు ఉపాధ్యాయుడు
తుని. (కాకినాడ జిల్లా)
కలం పేరు : వరశ్రీ



చట్టం సాహితీ లోకం 95814 19999

## రాబోవు తరానికి వెలుగులు



ఈనాటివిద్యార్థినీ విద్యార్థులు
రేపటి తరానికి దిక్సూచిలు

చిమ్మ చీకట్లను చీల్చే
రారాజువ్వలు వాళ్లు

నవభారత నిర్మాతలు
దేశ భవితకు బాటసారులు

అవినీతిని ప్రశ్నించే
విప్లవ జ్యోతులు వారు

అక్రమాలను వెలుగులోకి
తెచ్చే వెలుగు దీపాలు వారు

సమాజానికి వెలుగు దివ్వెలు
నవ సమాజ నిర్మాతలు వారు

దేశ భవితను కాపాడే
విద్యావేత్తలు వారు

మన దేశ రక్షణకు
పతిన పూనిన వీర సైనికులు

ప్రాణాలకు తెగించి పోరాడే
వీర సైనికులు వారు

కొందరుఉపాధ్యాయులగాను
మరికొందరుశాస్త్రవేత్తల గాను

కొందరురాజకీయవేత్తలగాను
కవులు కళాకారులుగాను

డాక్టర్లు యాక్టర్లు గాను
తీర్చిదిద్దబడిన యువకులు

వీరు రేపటి వెలుగులు
ప్రపంచానికి ధ్రువతారాలు

రచన సొపాటి ప్రభాకర్
సాహితీ రత్న తెలుగుతేజం
నంది అవార్డుల గ్రహీత
చరవాణి 21 84 97 44 60

చట్టం సాహితీ లోకం 95814 19999

## ఆత్మహత్యలు అసలు వద్దు



ఆత్మహత్యలు చేసుకోకండి
బతుకు విలువను తెలియండి
భగవంతుడు ఇచ్చిన బతుకును
చేతులారా నాశనం చేసుకోకండి

కష్టమొచ్చిందని కడతేరకండి
కష్టాలు మనుషులకే వస్తాయి
పశువులకు రావు కదా మరి
కష్టాలు వచ్చిపోయే చుట్టాలు

మానవ జన్మ మళ్ళీ మళ్ళీ రాదు
కష్టసుఖాలు కావడి కుండలు
అవి వస్తుంటాయి పోతుంటాయి
దైర్యంగా ఎదురుకో జీవితాన్ని

అప్పులు ఐనాయని అదరకు
ఆత్మహత్యకు పూనుకోబోకు
బతికి సాధించాలి గాని చచ్చి
సాధించేది ఏముంది శూన్యం

మానవజన్మ ఉత్తమమైనది
అన్నిటికన్న మంచి జన్మ మనది
జన్మను సార్థకత చేసుకోవలె
బతుకుతూ భవసాగరం దాటవలె

బాధ కలిగితే భగవంతని వద్ద
నీ బాధను మౌనంగా చెప్పుకో
భగవంతుడు నీ మొరలు విని
నీ విన్నపాన్ని మన్నించగలడు

కష్టమొస్తే కన్నీరు కార్చుకొనక
దైర్యంగా ముందడుగు వేయి
జీవితమంటే పోరాటమే మరి
పోరాడి గెలవాలి బతుకులోన

ఆత్మహత్య ఆలోచన మానుకో
అయిన వారిని జ్ఞాపకం చేసుకో
మంచి కాలం ముందుంది తెలుసుకో
మనిషి విలువను తెలిసి మసలుకో

అక్కి నర్సింలు గౌడ్
విశ్రాంత ఉపాధ్యాయుడు
మల్లాపూర్ రంగారెడ్డి జిల్లా
కవి గాయకుడు

చట్టం సాహితీ లోకం 95814 19999

## ఓ అందమా...నీవెక్కడ..?



ఓ అందమా నీవెక్కడ...?
ఏడు రంగుల ఇంద్రధనుస్సు
వెలిసిన ఆకాశపు అంచులోనా...?
ఊహూ...

ఇదిగో ఈ సుందరి చీరమడతల్లో
సింగారించిన రంగవల్లిలో నేనిక్కడ..!

ఓ అందమా నీవెక్కడ...?
పురివిప్పి నాట్యమాడే
మయూరి అడుగుల సవ్వడిలోనా...?
ఊహూ...

ఇదిగో ఈ వయ్యారి నడకలో
ఎగిసే వసంత తరంగంలా నేనిక్కడ..!

ఓ అందమా నీవెక్కడ...?
గుభాళించే ఎర్రని గులాబి రేకుల్లోనా..?
ఊహూ...

ఇదిగో ఈ బాపుబొమ్మ నవ్వుల్లో
కురిసే పూలవానలో నేనిక్కడ..!

ఓ అందమా నీవెక్కడ...?
చల్లని వెన్నెలను కురిపించి
మురిపించే ఆ చందమామ ఒడిలోనా...?
ఊహూ...

ఇదిగో ఈ అతిలోక సుందరి ముఖాన
మెరిసే పౌర్ణమి వెలుగులో నేనిక్కడ..!

ఓ అందమా నీవెక్కడ...?
తళతళ మెరిసే తారల బొట్టులోనా...?
ఊహూ...

ఇదిగో ఈ జవరాలి జాలిచూపులో
జ్వలించే దీపశిఖలో నేనిక్కడ..!

ఓ అందమా నీవెక్కడ...?
ఇదిగో ఈ సుందరి సౌందర్య
సాక్షాత్కారంలో నేనిక్కడ..!


ఈమె మెడలో మెరిసే
ముత్యాలహారంలో నేనిక్కడ..!

ఈమె హృదయంలో
పలికే మృదుమధుర
సుస్వర గీతంలో నేనిక్కడ..!

రచన:
కవిరత్న
సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్
హైదరాబాద్

చట్టం సాహితీ లోకం 95814 19999

## తెలుగు వెలుగుల చైతన్య రాజు



రెండు ప్రపంచ తెలుగు మహాసభల ద్వారా తెలుగు భాషా వైభవాన్ని వెలుగులోకి తెచ్చిన
తెలుగు శిఖరం చైతన్య రాజు/
తెలుగు సంస్కృతి సింహాసనానికి శోభ నీవే
తెలుగు జాతికి జ్యోతి వి నీవు
తెలుగు వెలుగుల చైతన్యం నీది
మీ సేవలే తెలుగు తల్లికి హారాలు/
తెలుగు భాషా పుష్పాల్లో పరిమళంనీవు
తెలుగు సేవలో సౌరభం
గుండే గదులు నిండా
తెలుగు శ్వాస
తెలుగు వెలుగుల రారాజు
మన
చైతన్య రాజు/
తెలుగు తల్లి నుదుటిపై
తిలకం మెరవగా
ప్రపంచ వేదికపై తెలుగు జెండా
ఎగరేసిన
దీరుడు చైతన్య రాజు/
చిరునవ్వుతో మాటల మాధుర్యంతో మంత్రముగ్ధుల్ని చేసి మహాసభలకు
మహోన్నకి తెలుగువారిలోకొత్త చైతన్యాన్నితెచ్చిన తెలుగు నాయకుడు మన
చైతన్య రాజు/
ఈ వైభవంలో అక్షరాలు పులకితమై
పలకరిస్తున్నాయి ఆనందంగా కవిత్వమై
సాహితీ సింహాసనం అలంకరించిన వేళ
తెలుగు సంస్కృతి సౌర భాలు వికసించిన వేళ
తెలుగు భాషకు గౌరవం తీసుకురావడంలో
అచంచల విశ్వాసం అదే చైతన్య రాజు మహోన్నతి
చైతన్య దీప్తిగా తెలుగు భాష వెలిగిన చైతన్య రాజు కృషి అపూర్వం
అద్వితీయం/
తెలుగు తల్లి సేవలో నిత్యం వెలిగే చైతన్య జ్యోతి
ప్రపంచ వేదికపై తెలుగు గౌరవాన్ని వైభవాన్ని
నిలబెట్టిన తెలుగు రారాజు
తెలుగు భాషకు భూషణం
తెలుగు భాషకు శక్తి చైతన్య రాజు/
కోనసీమ ఖ్యాతిని, తెలుగు వైభవాన్ని
విశ్వవ్యాప్తం చేయడానికి మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు చైతన్య రాజు
చైతన్యవంతమైన నిర్వహణలో
ప్రతిష్టాత్మక తెలుగు పండుగ/

(డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో కిమ్స్ వైద్య కళాశాల కిమ్స్ హాస్పిటల్స్ మరియు గోదావరి గోబల్ యూనివర్సిటీల సంయుక్త ఆధ్వర్యంలో మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో ఫిబ్రవరి 28 మార్చి ఒకటి ఈ రెండు రోజులు పై సంస్థల ఫౌండర్ చైర్మన్, కె. వి. వి .సత్యనారాయణ రాజు శ్రీ చైతన్య రాజు నిర్వహణలో ఒక పండుగలా జరుగుతున్న సందర్భంలో తెలుగు వారందరి తరపున ఆయనను అభినందిస్తూ రచించిన కవిత)

నడక కవి ,అక్షర ప్రవీణ
నల్లా నరసింహామూర్తి
సీనియర్ తెలుగు లెక్చరర్
శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులు
కురసాల వారి వీధి అమలాపురం
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
9247577501



చట్టం సాహితీ లోకం 95814 19999

## నేదునూరి మాట ఓ మనిషి



అవలక్షణాలను వదులుకో

ఉన్నత స్థాయికి చేరుకో

ప్రతి వ్యక్తి తన జీవితంలో
ఉన్నత స్థాయికి ఎదగడానికి
ఆరాటపడుతాడు నిత్యం
పోరాటం చేస్తాడు

వ్యక్తి తనలో ఉన్న
అవలక్షణాలను
వదులుకోవాలి
ఆశావ హదృక్పథాన్ని
పెంచుకోవాలి

అహంకారం మనప్రగతిని
అభివృద్ధిని అడ్డుకుంటుంది
భయం మన ఊహలను
తుంచేస్తుంది

కోపం ఒక నిప్పు కణిక లాంటిది
ఇతరులను కాల్చక ముందే
నిన్ను ధహిస్తుంది

ఈర్ష ప్రశాంతతను
పోగొట్టుతుంది
సందేహం ఆత్మ విశ్వాసాన్ని
చంపుతుంది

సోమరితనం ఆశయాన్ని
అటకెక్కిస్తుంది
పోలికత్వం ప్రతిభను
అడ్డుకుంటుంది

అసూయను వదులుకో
ప్రశాంతతను చేరుకో
కోపాన్ని అదుపుచేయి
బంధాలను బలోపేతం చేయి
అహాన్ని పక్కన బెట్టు
గౌరవాన్ని నిలబెట్టుకో

ఓటమి ఎదురైతే అది
ముగింపు కాదు
గెలుపువైపు వేసే మరో అడుగు
లోకం నిన్ను విమర్శించిన
లక్ష్యసాధనలో వెనకడుగు
వేయకు
నీనమ్మకమే నిన్ను ఉన్నత
స్థాయికి చేరుస్తుంది

శ్రమను ఆయుధంగా మార్చుకో
ప్రగతి పురోగతి వైపు సాగిపో
సంకల్ప బలం కార్యశీలత
పట్టుదల సానుకూల దృక్పథం
నిన్ను ఉన్నత స్థాయికి
చేర్చుతాయి

ధైర్యం సహనం సమన్వయం
నీ లక్ష్యసాధనకు సాధనాలు
కావాలి
మంచి మనిషిగా ఎదగాలంటే
మనసులోని మురికిని
కడగాలి

మమత మానవీయత
పరివ్యాప్తికి పాటుపడాలి
అవగాహన చైతన్యమే
నవ జీవన శైలి కావాలి

పరోపకారం ప్రగతి శీలత
పునాదులపై మానవాభివృద్ధికి
బాటవేయాలి


అసూయను విడనాడాలి
ఆనందాన్ని పెంచాలి
అందరికి పంచాలి

పరులపై నిందలు వేయడం
మాని నిన్ను నీవు తీర్చిదిద్దుకో
పరనింద వద్దు స్వయం ప్రేరణే
హద్దు కావాలి

ఓ మనిషి అభివృద్ధికి అడ్డుగా
నిలిచే అవలక్షణాలు వదులుకో
ఉన్నత స్థాయికి చేరుకో

నేదునూరి కనకయ్య
ఫ్రీలాన్స్ రచయిత
కాలమిస్ట్ కరీంనగర్
9440245771

# ఒక్కటైన విజయ్ దేవరకొండ- రష్మిక మందన్న




విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న (విరోష్) పెళ్లి వేడుకలు రాజస్థాన్ ఉదయపూర్‌లోని ×ుజ మెమెంటోస్ (ఎకాయా ఉదయపూర్) హోటల్‌లో ఘనంగా జరుగుతున్నాయి. సరిగ్గా ఉదయం 10 గంటల 10 నిమిషాలకు రష్మిక మెడలో విజయ్ దేవరకొండ మూడు ముళ్లు వేసినట్లు సమాచారం. అతికొద్ది మంది అతిథుల సమక్షంలో మేళ తాళాల నడుమ ఈ వేడుక అట్టహాసంగా జరిగిందని తెలుస్తోంది. ఉదయపూర్ ప్యాలెస్ వేదికగా అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యులు సమక్షంలో వేదమంత్రాల సాక్షిగా విజయ్ దేవరకొండ -- రష్మిక మందన్న ఏడడుగుల బంధంలోకి అడుగు పెట్టారు. దాదాపు 8 సంవత్సరాలుగా డేటింగ్ చేస్తున్న ఈ జంట ఎట్టకేలకు వైవాహిక బంధంలోకి అడుగుపెట్టి అభిమానులను ఖుషీ చేశారు. విజయ్ దేవరకొండ- రష్మిక మందన్న వివాహ బంధంతో ఒక్కటి కావడంతో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అటు విజయ్ ఫ్యాన్స్, ఇటు రష్మిక ఫ్యాన్స్ ఖుషీ ఖుషీ అవుతూ ఫుల్లుగా ఎంజాయ్ చేస్తున్నారు.




# టాక్సిక్ కోసం యష్ క్రేజీ మేకోవర్..



పాన్ ఇండియా స్టార్, అందులోనూ రాకింగ్ స్టార్ యష్ అనగానే.. ఆ పొడవాటి జుట్టు, గుబురు గడ్డం, ఊరమాస్ లుక్ టక్కున కళ్లముందు మెదులుతాయి. కేజీఎఫ్ సిరీస్ నుంచి దాదాపు ఎన్నో ఏళ్లుగా అదే లుక్ మైంటైన్ చేసిన యష్.. ఎట్టకేలకు ఆ ఐకానిక్ స్టైల్‌కి ఎండ్ కార్డ్ వేశాడు. గీతూ మోహన్‌దాస్ డైరెక్షన్‌లో వస్తున్న తన అప్‌కమింగ్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్-అప్స్' కోసం పూర్తిగా మేకోవర్ అయ్యాడు. జుట్టు, గడ్డం ట్రిమ్ చేయించుకుంటూ న్యూ లుక్‌లోకి మారుతున్న ఓ మేకింగ్ వీడియోను తాజాగా రిలీజ్ చేయగా.. ఇప్పుడది సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. అందులో తన భార్య రాధికా పండిట్ యష్ గడ్డాన్ని పట్టుకుని.. "ఫైనల్లీ.. ఈ గడ్డానికి, జుట్టుకి విముక్తి దొరికింది" అంటూ ఎమోషనల్ అవ్వడం ఫ్యాన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటోంది. యష్ క్లీన్ షేవ్ లుక్ బయటకు రావడంతో.. ఈ సినిమాలో అతడు డబుల్ రోల్ చేస్తున్నాడనే ప్రచారానికి ఆజ్యం పోసినట్లైంది. రీసెంట్‌గా ఫిబ్రవరి 21న విడుదలైన పోస్టర్‌లో యష్ 'టికెట్' అనే కుర్రాడి పాత్రలో కనిపించాడు. ఈ మేకోవర్ వీడియో ఆ క్యారెక్టర్ కోసమే. అంతకుముందు జనవరి 8న తన బర్త్‌డే రోజున 'రాయ' అనే మరో లుక్‌ను రిలీజ్ చేశాడు. దీంతో సినిమాలో యష్ రెండు డిఫరెంట్ రోల్స్ ప్లే చేస్తున్నట్లు దాదాపు క్లారిటీ వచ్చేసింది. ఇదంతా ఒకెత్తయితే.. టీజర్‌లో కొన్ని సెకన్ల పాటు కనిపించిన ఓ మిస్టరీ 'జోకర్' క్యారెక్టర్ మరో ఎత్తు. ఆ క్లౌన్ మేకప్‌లో ఉన్నది యష్ మూడో అవతారమా? లేక కథను మలుపుతిప్పే ఏదైనా సింబాలిక్ క్యారెక్టరా? అంటూ ఫ్యాన్స్ బాగా చర్చించుకుంటున్నారు. సినిమా రిలీజ్ అయ్యేలోపు ఈ పజిల్‌ను సాల్వ్ చేసే పనిలో పడ్డారు నెటిజన్లు. ఈ పీరియడ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాలో భారీ తారాగణమే ఉంది. రుక్మిణి వసంత్ (మెలిస్సా), నయనతార (గంగ), కియారా అద్వానీ (నాడియా), హుమా ఖురేషీ (ఎలిజబెత్), తారా సుతారియా (రెబెక్కా) లాంటి స్టార్స్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, యశ్ హోమ్ బ్యానర్ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో ఒకేసారి షూట్ చేయడం విశేషం. రాజీవ్ రవి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. రవి బస్రూర్, విశాల్ మిశ్రా, తనిష్క్ బాగ్చీ మ్యూజిక్ ఇస్తున్నారు. ఉజ్వల్ కులకర్ణి ఎడిటర్‌గా పనిచేస్తున్నాడు. ముఖ్యంగా హాలీవుడ్ స్టంట్ మాస్టర్ జేజే పెర్రీ యాక్షన్ సీక్వెన్స్ డిజైన్ చేయడం సినిమాపై క్యూరియాసిటీని పెంచుతోంది.

# పర్సనల్ లైఫ్‌లోనూ



సినిమా ఇండస్ట్రీలో కొంతమంది హీరోయిన్లు సక్సెస్ ట్రాక్ కంటిన్యూ చేస్తూ పర్సనల్ లైఫ్‌ను కూడా ఎంతో ఎంజాయ్ చేస్తుంటారు. అలా ప్రొఫెషనల్, పర్సనల్ కెరీర్‌లో ఏ లోటూ లేకుండా ఆడియన్స్‌ని ఎంటర్‌టైన్ చేస్తున్న హీరోయిన్ కియారా అద్వానీ). అందంతో పాటు యాక్టింగ్ టాలెంట్‌తో ప్రేక్షకులకు అట్రాక్ట్ చేసే ఈ నటి ప్రస్తుతం బాలీవుడ్ బిజీ భామల్లో ఒకరిగా మారిపోయింది. హిందీతో పాటు తెలుగులోనూ సినిమాలు చేస్తున్న కియారా.. ఒక పక్క సినిమాలు, యాడ్స్ చేస్తూనే మరోవైపు లగ్జరీ లైఫ్ ఎంజాయ్ చేస్తోంది. రామ్‌చరణ్ హీరోగా నటించిన 'వినయ విధేయ రామ', గేమ్ ఛేంజర్ సినిమాలతో పాటు మహేశ్ బాబుతో 'భరత్ అనే నేను'లో నటించి తెలుగు ఆడియన్స్‌ని కియారా అద్వానీ దగ్గరైంది. అందంతో పాటు యాక్టింగ్ టాలెంట్ ఆమె సొంతం. 1992, జులై 31న ముంబైలో కియారా జన్మించింది. ఈ బ్యూటీ అసలు పేరు అలియా అద్వానీ. తండ్రి జగదీప్ అద్వానీ బిజినెస్‌మ్యాన్ కాగా, తల్లి జెనీవీవ్ జాఫ్రీ టీచర్. కియారా ముంబైలోని కేథడ్రల్, జాన్ కానన్ స్కూల్‌లో స్కూలింగ్, తర్వాత జై హింద్ కాలేజీలో మాస్ కమ్యూనికేషన్ డిగ్రీ కంప్లీట్ చేసింది. అయితే ఆమె బంధువులు సినీ ఇండస్ట్రీలో ఉండటంతో చిన్నప్పటి నుంచే బాలీవుడ్ గ్లోరీ, గ్లామర్‌కి అట్రాక్ట్ అయ్యింది. కియారా 2014లో 'ఫగ్లీ' మూవీతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 2016లో వచ్చిన స్పోర్ట్స్ బయోపిక్ 'ఎం.ఎస్ ధోనీ : ది అన్‌టోల్డ్ స్టోరీ'లో ఇంపార్టెంట్ క్యారెక్టర్ చేసి సక్సెస్ ట్రాక్‌లోకి వచ్చింది. లస్ట్ స్టోరీస్‌లో (2018) పోషించిన అన్ సాటిస్‌ఫైడ్ లైఫ్ పార్ట్‌నర్ క్యారెక్టర్‌తో తనలోని టాలెంట్‌ని బయటపెట్టింది. ఇక షాహిద్ కపూర్‌తో కలిసి సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించిన 'కబీర్ సింగ్'లో ప్రీతి క్యారెక్టర్ హైలెట్. గుడ్ న్యూజ్, షేర్షా, భూల్ భూలైయా 2, జుగ్ జుగ్ జీయో, సత్యప్రేమ్ కి కథ వంటి మరెన్నో చిత్రాలు చేసింది. డాన్ 3, టాక్సిక్ మూవీల్లోనూ నటిస్తోంది. కియారా కాంటెంపరరీ లైఫ్‌స్టైల్ తన క్యారెక్టర్‌ని రిఫ్లెక్ట్ చేస్తుంది. ఆమె బాలీవుడ్ హీరో సిద్దార్థ్ మల్హోత్రాను లవ్ మ్యారేజ్ చేసుకుంది. షేర్షా సినిమా షూటింగ్ టైమ్‌లో వీరి మధ్య ప్రేమ చిగురించింది. ఇప్పుడు వీరిద్దరికి కుమార్తె పుట్టింది. ప్రస్తుతం కియారా ఫ్యామిలీ బాంద్రాలో నివసిస్తోంది. ఈమె తన పర్సనల్ లైఫ్ అప్‌డేట్స్‌ని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుంటుంది.

# ఇంతవరకూ ఒక్క హిట్టు పడలేదు



ఎవరు ఏ రంగాన్ని ఎంచుకున్నప్పటికీ, అందులో రాణించాలంటే ప్రతిభ ఉండాలి. టాలెంట్ ఒక్కటి ఉంటే సరిపోతుందా అంటే, కొంచెం అదృష్టం కూడా ఉండాలనుకోండి అనే సమాధానం వస్తుంది. అదృష్టం అనే విషయంలో ఎవరి అభిప్రాయాలు వాళ్లకి ఉంటాయి. కాకపోతే అదృష్టం అనే దాని గురించి అప్పుడప్పుడు నమ్మవలసి వస్తుంటుంది. అందుకు కారణాలు .. కళ్లముందు కనిపించేవే అని చెప్పాల్సి ఉంటుంది. ఆశించినస్థాయిలో గుర్తింపు రానప్పుడు .. విజయాలు అందనప్పుడు .. అదృష్టం లేదని చెప్పుకుంటూ ఉంటారు. అలాంటి అదృష్టాన్ని వెతికి పట్టుకునే పనిలో ఉంటారు. ప్రస్తుతం భాగ్యశ్రీ బోర్సే అదే పనిలో ఉందని అంటున్నారు. ఇప్పుడున్న కథానాయికలలో గ్లామరస్ బ్యూటీ ఎవరంటే కుర్రకారు ఠకీమని చెప్పే మాట భాగ్యశ్రీ బోర్సే. తుమ్మెదల్లాంటి కళ్లతో మనసులు దోచే ఈ సుందరికి ఇంతవరకూ హిట్టు పడలేదు. ఆమె అభిమానులు బెంగపెట్టుకోవడంలోని అసలు కారణం ఇదే. ఈ నేపథ్యంలో ఆమె అఖిల్ సరసన నాయికగా 'లెనిన్' సినిమా చేస్తోంది. మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను, అన్నపూర్ణ - సితార సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'మే'లో ఈ సినిమాను విడుదల చేసే ఆలోచనలో ఉన్నారు. తమన్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. భాగ్యశ్రీ గ్లామర్ ఈ సినిమాకి ప్రత్యేకమైన ఆకర్షణగా నిలుస్తుందని అంటున్నారు. ఈ సినిమాతోనైనా ఆమెకి అదృష్టం కలిసొస్తుందేమో చూడాలి మరి.

# హుక్ స్టెప్‌ను కాపీ చేశారా?

నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ప్యారడైజ్. ఈ సినిమా కోసం అభిమానులు ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. దసరా సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నారు. కొన్ని నెలలుగా ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుగుతుంది. ఇందులో నాని సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. దీంతో ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ పై భారీ బజ్ నెలకొంది. నాని ఈ సినిమాలో డిఫరెంట్ లుక్ తో పాటు యాక్షన్ మోడ్ లో కనిపించనున్నాడు. ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్స్, సాంగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. తాజాగా ప్యారడైజ్ సినిమా నుంచి ఆయా షేర్ అనే సాంగ్ ను విడుదల చేశారు. అనిరుధ్ ఈ సినిమాకు సంగీతం అందించారు. నాని పుట్టిన రోజు సందర్భంగా ఈ సాంగ్ ని విడుదల చేశారు. విడుదలైన కొన్ని గంటల్లోనే ఈ సాంగ్ సోషల్ మీడియాలో దుమ్మురేపింది. ఎక్కడ చూసిన ఈ సాంగే వినిపిస్తుంది. అలాగే ఈ సాంగ్ లోని హుక్ స్టెప్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. నాని ఈ సాంగ్ లో డాన్స్ అదరగొట్టాడు. ముఖ్యంగా హుక్ స్టెప్ అందరిని విశేషంగా ఆకట్టుకుంది. అయితే ఈ సాంగ్ హుక్ స్టెప్ ను కాపీ చేశారంటూ సోషల్ మీడియాలో కొన్ని మీమ్స్ వైరల్ అవుతున్నాయి. తాజాగా ఓ యూట్యూబర్ మాత్రం ఇందులో నాని వేసిన హుక్ స్టెప్ నాదే అని, కాపీ కొట్టేశారని అంటున్నాడు. బాబా జాక్సన్ పేరుతో ఉన్న ఓ ఇన్ఫ్లుయెన్సర్ సోషల్ మీడియాలో డాన్స్ వీడియోలతో పాపులర్ అయ్యాడు. డిఫరెంట్ డాన్స్ మూవీస్ తో మంచి ఫాలోయింగ్ సొంతం చేసుకున్నాడు. గతంలో ఓ ఫారెనర్ తో కలిసి ఈ డాన్సు స్టెప్ వేశాడు. అదే స్టెప్ ను ఇప్పుడు నాని ప్యారడైజ్ సినిమాలో కాపీ చేశారని అంటున్నారు. కొంతమంది నెటిజన్స్ ఆ రెండు వీడియోలను పక్కపక్కన పెట్టి ఒరిజినల్, కాపీ అంటూ పోస్ట్ లు పెడుతున్నారు.



# అందం, అభినయంతో మెస్మరైజ్ చేసింది



రీసెంట్ డేస్ లో కొంతమంది హీరోయిన్స్ ఓవర్ నైట్ లో స్టార్ డమ్ సొంతం చేసుకుంటున్నారు. ఒకే ఒక్క సినిమాతో పాపులర్ అవుతున్నారు. ఇప్పటికే మన దగ్గర యంగ్ బ్యూటీస్ చాలా మంది. ఒకొక్క సినిమాకు ఒకొక్క హీరోయిన్ పరిచయం అవుతుంది. అయితే ఓ ముద్దుగుమ్మ మాత్రం ఇండస్ట్రీలో నాయా రికార్డ్ క్రియేట్ చేసింది. కేవలం 22ఏళ్ల ఆ ముద్దుగుమ్మ ఇండస్ట్రీని షేక్ చేసింది. ఆమె అందానికి, నటనకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఆమె తొలి సినిమానే వందలకోట్ల కలెక్షన్స్ రాబట్టింది. స్టార్ హీరోలు కూడా ఆమె నటనకు, అందానికి ఫ్లాట్ అయ్యారు. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? ఇటీవలే బాక్సాఫీస్ వద్ద ఓ సినిమా సంచలనం సృష్టిస్తుంది. ఆ సినిమాతో 22 ఏళ్ల హీరోయిన్ రికార్డ్స్ తిరగరాస్తుంది. ప్రస్తుతం బాలీవుడ్ ఇండస్ట్రీలో మారుమోగుతున్న పేరు అనీత్ పద్ద. వయసు 22 సంవత్సరాలు. పంజాబ్ లోని అమృత్ సర్ లో జన్మించిన ఈ వయ్యారి.. మోహిత్ సూరి దర్శకత్వం వహించిన సయ్యారా సినిమాతో కథానాయికగా సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది. జూలై 18న విడుదలైన ఈ సినిమా రూ. 570 కోట్లకు పైగా వసూలు చేసింది. ఈ సినిమాతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది అనీత్ పద్ద. అందం, అభినయంతో మెస్మరైజ్ చేసింది. ఈ సినిమా చూసిన ప్రతి ఒక్కరు ఈ అమ్మడు గురించి తెలుసుకోవడానికి ట్రై చేశారు. అనీత్ పద్ద.. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేషన్ చేస్తుందట. నటనపై ఆసక్తితో మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది అనీత్ పద్ద. ఇప్పటికే పలు యాడ్స్ చేసింది. ఇక సయ్యారా సినిమాతో కథానాయికగా వెండితెరకు పరిచయమైంది. ఫస్ట్ మూవీతోనే ఊహించని విజయాన్ని ఖాతాలో వేసుకున్న ఈ సుందరి.. ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. సయ్యారా సినిమాపై చాలా మంది సెలబ్రెటీలు, స్టార్ హీరోలు కూడా ప్రశంసలు కురిపించారు. హీరోహీరోయిన్స్ పై పొగడ్తలు కురిపించారు.

.............

# చట్టం స్పోర్ట్స్

## విండీస్ విజయంతో మారిన టీమిండియా సెమీస్ లెక్కలు

హాట్ ఫేవరెట్స్ ట్యాగ్‌తో టి20 ప్రపంచకప్ 2026 లో అడుగు పెట్టిన భారత జట్టుకు సెమీస్ చేరే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. గ్రూప్ దశలో వరుస విజయాలతో సూపర్ 8కు చేరిన భారత జట్టు.. ఒకే ఒక్క ఓటమితో సెమీస్ అవకాశాలను క్లిష్టంగా చేసుకున్నాయి. ఇప్పుడు భారత్ సెమీస్ చేరాలంటే మరో జట్టుపై ఆధారపడాల్సిన పరిస్థితి దాపురించింది. ఆదివారం జరిగిన పోరులో సౌతాఫ్రికా చేతిలో టీమిండియా ఘోరంగా ఓడింది. ఏకంగా 76 పరుగుల తేడాతో ఓటమిని చవిచూసింది. ఫలితంగా టీమిండియా నెట్ రన్ రేట్ పాతాళానికి (–3.88) పడిపోయింది. ఇక సోమవారం జింబాబ్వేపై వెస్టిండీస్ గెలవడంతో టీమిండియా సెమీస్ చేరే అవకాశాలు మరింతగా సన్నగిల్లాయి. జింబాబ్వేపై వెస్టిండీస్ ఏకంగా 107 పరుగుల భారీ తేడాతో గెలిచింది. ఫలితంగా వెస్టిండీస్ నెట్ రన్ రేట్ ం5.350కి చేరుకుంది. ఇక జింబాబ్వే నెట్ రన్ రేట్ –5.350. ఈ స్థితి నుంచి జింబాబ్వే సెమీస్ చేరడం దాదాపు కష్టమే. అయితే భారత్ పరిస్థితి ఏంటంటే మాత్రం.. కష్టమనే చెప్పాలి. ఇప్పుడు



భారత్ సెమీస్ చేరాలంటే రెండు పనులు జరగాలి. అందులో మొదటిది మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ భారత్ భారీ తేడాతో నెగ్గాలి. ఇక రెండోది సౌతాఫ్రికా వెస్టిండీస్, జింబాబ్వేలపై గెలవాలి. అప్పుడు భారత్ 4 పాయింట్లతో సెమీస్ చేరుతుంది. ఒకవేళ సౌతాఫ్రికా వెస్టిండీస్ చేతిలో ఓడితే మాత్రం టీమిండియా సెమీస్‌కు చేరడం కష్టమే. ఎందుకంటే.. జింబాబ్వేపై సౌతాఫ్రికా గెలిచే అవకాశాలు ఎక్కువ. దాంతో అప్పుడు సౌతాఫ్రికా వద్ద 4 పాయింట్ల ఉంటాయి. ఇక వెస్టిండీస్ సౌతాఫ్రికాపై గెలిచి భారత్ చేతిలో ఓడితే అప్పుడు విండీస్‌కు కూడా 4 పాయింట్లు ఉంటాయి. భారత్ తన చివరి రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే అప్పుడు టీమిండియా దగ్గర కూడా 4 పాయింట్లు ఉంటాయి. ఈ సమయంలో నెట్ రన్ రేట్ లెక్కలోకి వస్తుంది. ప్రస్తుతం విండీస్, సౌతాఫ్రికాల నెట్ రన్ రేట్ భారత్ కంటే ఎంతో మెరుగ్గా ఉంది. అలాంటి పరిస్థితుల్లో విండీస్, సౌతాఫ్రికాలు సెమీస్ కు చేరతాయి. భారత్, జింబాబ్వేలు ఇంటిదారి పడతాడు. గురువారం జింబాబ్వేతో జరిగే పోరులో టీమిండియా భారీ విజయాన్ని అందుకోవాల్సి ఉంది. ఎలా అంటే 150 పరుగుల లక్ష్యాన్ని 11 ఓవర్లలోపు ఛేదించడం.. లేదంటే 100 పరుగుల తేడాతో గెలవడం వంటివి చేయాలి. అప్పుడే భారత జట్టు నెట్ రన్ రేట్ మెరుగవుతుంది. పోరాడి గెలిస్తే మాత్రం నెట్ రన్ రేట్ మైనస్‌లోనే ఉంటుంది. సౌతాఫ్రికాతో జరిగిన పోరులో టీమిండియా ప్లేయింగ్ ఎలెవెన్ పై కూడా విమర్శలు వస్తున్నాయి. అక్షర్ పటేల్‌ను పక్కన పెట్టడం ఏంటంటూ గంభీర్‌పై అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక అదే సమయంలో వరుసగా విఫలం అవుతున్న తిలక్ వర్మ, అభిషేక్ శర్మలకు ఛాన్స్‌లు ఇవ్వడంపై కూడా మండిపడుతున్నారు. భారత్ తన చివరి రెండు మ్యాచ్‌లను ఫిబ్రవరి 26న జింబాబ్వేతో.. మార్చి 1న వెస్టిండీస్‌లతో ఆడుతుంది.


## టీ20 వరల్డ్ కప్‌లో సరికొత్త మైలురాయి..

టీ20 వరల్డ్ కప్ 2026లో వెస్టిండీస్‌తో జరిగిన కీలక సూపర్–8 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా అనుభవజ్ఞుడైన ఫాస్ట్ బౌలర్ కగిసో రబడా అద్భుతమైన రికార్డు సాధించాడు. ఈ మ్యాచ్‌లో రబడా, టీ20 వరల్డ్ కప్ చరిత్రలో దక్షిణాఫ్రికా తరపున అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచి డేల్ స్టెయిన్‌ను అధిగమించాడు. మ్యాచ్ ప్రారంభంలోనే రబడా వెస్టిండీస్ టాప్ ఆర్డర్‌ను కూల్చి దక్షిణాఫ్రికాకు కలల ఆరంభాన్ని అందించాడు. కుడిచేతి వేగబంతి సంధించిన అతని ప్రారంభ స్పెల్ విండీస్ బ్యాటింగ్‌ను పూర్తిగా అతలాకుతలం చేసింది. దీంతో డేల్ స్టెయిన్‌ను దాటి టీ20 వరల్డ్ కప్‌లో అత్యధిక వికెట్లు తీసిన దక్షిణాఫ్రికా బౌలర్ల జాబితాలో రబడా రెండో స్థానానికి చేరాడు. నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన సూపర్–8 మ్యాచ్‌లో టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా కెప్టెన్ ఐడెన్ మార్క్రామ్ వెస్టిండీస్‌ను ముందుగా బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. షాయ్ హోప్ -- బ్రాండన్ కింగ్ జోడీ 2.1 ఓవర్లలో 29 పరుగులు జోడిస్తూ దక్షిణాఫ్రికా బౌలర్లపై ఆధిపత్యం చూపింది. అయితే మూడో ఓవర్‌లో షాయ్ హోప్‌ను ఔట్ చేయడంతో రబడా వెస్టిండీస్ పతనానికి నాంది పలికాడు. ఆ తర్వాత ఫామ్‌లో ఉన్న షిమ్రోన్ హెట్‌మైయర్‌ను కూడా పెవిలియన్‌కు పంపి కరీబియన్ జట్టును గట్టిగా కుదిపేశాడు. ఈ రెండు వికెట్లతో రబడా తన టీ20 వరల్డ్ కప్ వికెట్ల సంఖ్యను పెంచి డేల్ స్టెయిన్ రికార్డును దాటాడు. ఇప్పటికే టీ20 వరల్డ్ కప్‌లో 30 వికెట్లు తీసిన రబడా, ఈ మ్యాచ్‌తో ఆ సంఖ్యను 32కి పెంచాడు. దీంతో అతను దక్షిణాఫ్రికా తరపున రెండో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ప్రస్తుతం అన్రిచ్ నోర్జే 37 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా, రబడా, డేల్ స్టెయిన్, మోర్నే మోర్కెల్, టబ్రైజ్ షమ్సీ వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఆధునిక క్రికెట్‌లో అత్యుత్తమ ఫాస్ట్ బౌలర్లలో ఒకడిగా గుర్తింపు పొందిన



కగిసో రబడా, టోర్నీ ప్రారంభ మ్యాచ్‌ల్లో కొంత ఫామ్ కోల్పోయినట్లు కనిపించాడు. అఫ్ఘానిస్తాన్, కెనడా మ్యాచ్‌ల్లో కలిపి రెండు వికెట్లు మాత్రమే తీసుకున్న అతను, వరుసగా మూడు మ్యాచ్‌ల్లో వికెట్ లేకుండా నిలిచాడు. అయితే, వెస్టిండీస్‌పై చూపిన ఈ అద్భుత ప్రదర్శనతో రబడా మళ్లీ తన పాత మోజోను తిరిగి పొందినట్టైంది. సెమీఫైనల్ లక్ష్యంతో దూసుకెళ్తున్న దక్షిణాఫ్రికాకు రబడా బౌలింగ్ కీలక ఆయుధంగా మారనుంది. మిగిలిన మ్యాచ్‌ల్లో కూడా అతను ఇదే స్థాయిలో రాణిస్తే ప్రోటీస్‌కు భారీ లాభం చేకూరనుంది.

## శివమ్ దూబే బౌలింగ్ తీరుపై కైఫ్ విమర్శలు



టీమిండియా బ్యాటింగ్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే బౌలింగ్ తీరుపై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ విమర్శలు గుప్పించాడు. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేసే శివమ్ దూబే ఆల్‌రౌండర్ కాదని, కేవలం బ్యాటర్ మాత్రమేనని తెలిపాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా సౌతాఫ్రికాతో జరిగిన సూపర్–8 మ్యాచ్‌లో టీమిండియా 76 పరుగుల తేడాతో ఓటమిపాలైన సంగతి తెలిసిందే. ఈ ఘోర పరాజయంతో టీమిండియా క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటుంది. దర్జాగా సెమీఫైనల్ చేరుతుందనుకున్న టీమిండియా ఇప్పుడు ఒత్తిడిని అధిగమించి తప్పనిసరిగా వరుస రెండు మ్యాచ్‌లు గెలవడంతో పాటు రన్‌రేట్‌పై కూడా ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. జింబాబ్వేతో గురువారం తమ రెండో సూపర్–8 మ్యాచ్‌కు టీమిండియా సిద్ధమైంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన మహమ్మద్ కైఫ్.. శివమ్ దూబే బౌలింగ్ తీరుపై అసహనం వ్యక్తం చేశాడు. తుది జట్టులో సంజూ శాంసన్‌ను ఆడించాలన్నాడు. 'సౌతాఫ్రికాతో మ్యాచ్‌లో ఫీల్డ్ సెటప్, బ్రెవిస్‌కు వైడ్ యార్కర్స్ వేయాలనే ప్రణాళికను చూస్తుంటే.. శివమ్ దూబే చాలా డిఫెన్సివ్‌గా బౌలింగ్ చేయాలనే ప్రయత్నంలో ఉన్నట్లు అర్థమైంది. అయితే ఎవడైనా 10వ ఓవర్‌లో డిఫెన్సివ్‌గా బౌలింగ్ చేస్తారా? ఆ సమయంలో ఎవరైనా వికెట్ తీయడానికి అటాకింగ్ బౌలింగ్ చేస్తారు. నా అభిప్రాయం ప్రకారం శివమ్ దూబే కేవలం బ్యాటర్ మాత్రమే. అతను ఆల్‌రౌండర్ కాదు. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేసే ఆల్‌రౌండర్ టీమిండియాకు అవసరం లేదు. అతను అప్పుడప్పుడు ఒక వికెట్ తీయవచ్చు కానీ ఎప్పుడూ పరుగులు ఇచ్చుకుంటూనే ఉంటాడు. వెస్టిండీస్‌తో జరిగే మ్యాచ్‌లో అతను ఒకే ఓవర్‌లో నాలుగు సిక్సర్లు కూడా ఇచ్చే ప్రమాదం ఉందిటీమిండియా కాంబినేషన్‌లో సమతుల్యత లోపించింది. భారత్ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ల విషయంలో హద్దులు దాటి వెళ్తోంది. టాప్ 8 బ్యాటర్లలో ఆరుగురు ఎడమచేతి వాటం బ్యాటర్లే ఉన్నారు. లెఫ్ట్–రైట్ కాంబినేషన్ కోసం హార్దిక్ పాండ్యా ఐదో స్థానంలో వస్తున్నాడు. అదే మీ విన్నింగ్ ఫార్ములా అని మీరు భావిస్తే.. దానిని దృష్టిలో ఉంచుకుని జట్టును ఎంపిక చేయండి. ఆ లెఫ్ట్–రైట్ కాంబినేషన్ కోసం సంజూ శాంసన్‌ను జట్టులోకి తీసుకోండి' అని కైఫ్ సూచించాడు. సౌతాఫ్రికాతో మ్యాచ్‌లో శివమ్ దూబే 2 ఓవర్లు బౌలింగ్ చేసి ఒక వికెట్ తీసి 32 పరుగులిచ్చుకున్నాడు. ఈ ఏడాది దూబే 19.57 సగటుతో 7 వికెట్లు తీసాడు. అతని ఎకానమీ రేట్ 10 కంటే ఎక్కువగా ఉంది. బ్యాటింగ్‌లో మెరుగైన ప్రదర్శన చేస్తున్నా.. బౌలింగ్ అంత గొప్పగా లేదు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ కైఫ్ విమర్శలు గుప్పించాడు.

## 19 ఏళ్ల టీ20 వరల్డ్ కప్ చరిత్రలో శ్రీలంక చెత్త రికార్డు



టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్ 8 దశలో భాగంగా బుధవారం కొలంబోలోని ఆర్.ప్రేమదాస స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక జట్టుకు తీరని అవమానం ఎదురైంది. న్యూజిలాండ్‌తో జరిగిన ఈ కీలక పోరులో లంక ఘోర పరాజయాన్ని మూటగట్టుకోవడమే కాకుండా, టీ20 ప్రపంచకప్ 19 ఏళ్ల చరిత్రలోనే ఎన్నడూ లేని ఒక అత్యంత చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకుంది. పరుగుల వేటలో తడబడిన శ్రీలంక ఆటగాళ్లు పవర్‌ప్లేలో చేతులెత్తేయడం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. మొదట టాస్ గెలిచిన శ్రీలంక బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ ఇన్నింగ్స్ ఆరంభంలో చాలా నిలకడగా సాగింది. ఒకానొక దశలో 75 పరుగుల వద్ద కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయిన కివీస్, భారీ స్కోరు సాధించేలా కనిపించింది. అయితే శ్రీలంక బౌలర్లు పుంజుకోవడంతో సీన్ రివర్స్ అయింది. కేవలం 9 పరుగుల వ్యవధిలోనే 4 కీలక వికెట్లు కోల్పోయిన న్యూజిలాండ్, 84 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. కనీసం 120 పరుగులు చేస్తుందా అని అనుకుంటున్న తరుణంలో కెప్టెన్ మిచెల్ సాంట్నర్, కోల్ మెక్కాన్చీలు అద్భుతం చేశారు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు ఏకంగా 47 బంతుల్లో 84 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పి, జట్టు స్కోరును 20 ఓవర్లలో 168/7కి చేర్చారు. 169 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆరంభంలోనే చుక్కలు కనిపించాయి. కివీస్ బౌలర్ల ధాటికి లంక బ్యాటర్లు క్రీజులో నిలవడానికి నానా తంటాలు పడ్డారు. ఈ క్రమంలోనే టీ20 వరల్డ్ కప్ చరిత్రలోనే శ్రీలంక తన అత్యల్ప పవర్‌ప్లే స్కోరును నమోదు చేసింది. మొదటి 6 ఓవర్లలో కేవలం 20 పరుగులు మాత్రమే చేసి 2 వికెట్లు కోల్పోయింది. ఇంతకుముందెన్నడూ లంక ఇంత ఘోరంగా పవర్‌ప్లేలో ఆడలేదు. లక్ష్యం పెద్దదైనప్పుడు ధాటిగా ఆడాల్సింది పోయి, అతి జాగ్రత్తగా ఆడి వికెట్లు పారేసుకోవడం ఆ జట్టు కొంపముంచింది. చివరికి శ్రీలంక జట్టు 20 ఓవర్లలో 107/8 పరుగులకే పరిమితమై 61 పరుగుల తేడాతో చిత్తుగా ఓడిపోయింది. జట్టులో కామిందు మెండిస్ (31 పరుగులు) మినహా ఎవరూ 30 పరుగుల మార్కును దాటలేకపోయారు. న్యూజిలాండ్ స్పిన్నర్ రచిన్ రవీంద్ర 4 వికెట్లతో లంక పతనాన్ని శాసించాడు. ఈ ఓటమితో శ్రీలంక సెమీఫైనల్ రేసు నుండి అధికారికంగా నిష్క్రమించగా, కివీస్ తన సెమీస్ అవకాశాలను మరింత మెరుగుపరుచుకుంది. తన చివరి మ్యాచ్‌లో కూడా గెలిస్తే న్యూజిలాండ్ నేరుగా సెమీస్‌కు చేరుకుంటుంది.

## గంభీర్‌కు రహానే చురకలు



మిండియా వెటరన్ ప్లేయర్ అజింక్యా రహానే భారత జట్టు మేనేజ్‌మెంట్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. 2026 టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా సౌత్ ఆఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఎదుర్కొన్న ఘోర పరాజయంపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా జట్టు ఎంపికలో మేనేజ్‌మెంట్ అనుసరించిన వ్యూహాలను ఆయన తప్పుబట్టారు. మరీ ముఖ్యంగా అక్షర్ పటేల్‌ను కాదని వాషింగ్టన్ సుందర్‌ను జట్టులోకి తీసుకోవడంపై ఆయన ప్రశ్నించారు. భారత క్రికెట్ జట్టు మేనేజ్‌మెంట్ తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలపై అజింక్యా రహానే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా టీ20 ప్రపంచకప్ సూపర్–8 దశలో సౌత్ ఆఫ్రికాతో జరిగిన కీలక పోరులో భారత్ అనుసరించిన 'మ్యాచ్–అప్' వ్యూహాలను ఆయన తప్పుబట్టారు. ఎంపిక విషయంలో 'అతి తెలివి'ప్రదర్శించడం జట్టు ప్రదర్శనపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన హెచ్చరించారు. ఒక రకంగా కోచ్ గంభీర్‌కు చురకలు అంటించాడు. సౌత్ ఆఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో స్టార్ ఆల్‌రౌండర్, జట్టు వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్‌ను తుది జట్టు నుంచి తప్పించడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని రహానే పేర్కొన్నారు. "అక్షర్ పటేల్ జట్టులో లేకపోవడం చూసి నేను నిజంగా షాక్ అయ్యాను. జట్టులో ఏం జరుగుతుందో నాకు అర్థం కావడం లేదు. వాషింగ్టన్ సుందర్ మంచి ఆటగాడే కావచ్చు, అందులో ఎవరికీ సందేహం లేదు. కానీ అక్షర్ గత కొంతకాలంగా అన్ని రకాల పరిస్థితుల్లోనూ అద్భుతంగా రాణిస్తున్నాడు. జట్టులో ప్రధాన ఆటగాడిని పక్కన పెట్టి ప్రయోగాలు చేయడం సరికాదు" అని రహానే 'క్రిక్ బజ్'తో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. సౌత్ ఆఫ్రికా టాప్ ఆర్డర్‌లో ముగ్గురు లెఫ్ట్ హ్యాండర్ బ్యాటర్లు (క్వింటన్ డికాక్, రియాన్ రికెల్టన్, డేవిడ్ మిల్లర్) ఉన్నారనే కారణంతో ఆఫ్–స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌ను జట్టులోకి తీసుకున్నారు. ఈ నిర్ణయంపై రహానే స్పందిస్తూ.. "కేవలం అవతలి జట్టులో ఎడమచేతి వాటం బ్యాటర్లు ఉన్నారని ఒక ఆఫ్–స్పిన్నర్‌ను తీసుకురావడం ఎప్పుడూ సరైన వ్యూహం కాదు. ఆఫ్–స్పిన్నర్లు లెఫ్ట్ హ్యాండర్లను కచ్చితంగా అవుట్ చేస్తారనే గ్యారెంటీ ఎక్కడుంది? అక్షర్ పటేల్‌కు లెఫ్ట్ హ్యాండర్లకు వ్యతిరేకంగా మంచి రికార్డు ఉంది. సెలక్షన్ విషయంలో అతి తెలివి ప్రదర్శిస్తే అది జట్టుకు నష్టం కలిగిస్తుంది" అని విమర్శించారు. సౌత్ ఆఫ్రికాతో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 76 పరుగుల భారీ తేడాతో ఓటమి పాలైంది. జస్ప్రీత్ బుమ్రా ఆరంభంలోనే డికాక్, రికెల్టన్ అవుట్ చేసినప్పటికీ, ఆ తర్వాత వచ్చిన డేవిడ్ మిల్లర్, డెవాల్డ్ బ్రెవిస్ భారత బౌలింగ్‌ను చితక్కొట్టారు. వ్యూహాత్మక మార్పుగా వచ్చిన వాషింగ్టన్ సుందర్ కేవలం రెండు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేసి విఫలమయ్యాడు. దీనిపై రహానే అసహనం వ్యక్తం చేస్తూ.. కేవలం ఇద్దరు ఓవర్ల కోసమే అక్షర్ వంటి కీలక ఆటగాడిని పక్కన పెట్టడం సమర్థనీయం కాదని అన్నారు. కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమ్ మేనేజ్‌మెంట్ ప్లాన్–బి లేకుండా బరిలోకి దిగిందని విమర్శలు వస్తున్నాయి. మ్యాచ్ అనంతరం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మేనేజ్‌మెంట్ తమ నిర్ణయాన్ని సమర్థించుకున్నప్పటికీ, అందులో తర్కం లేదని రహానే అభిప్రాయపడ్డారు. "అక్షర్ పటేల్ జట్టు వైస్ కెప్టెన్. అతనికి ఏదైనా గాయం అయితే తప్ప, ఫిట్‌గా ఉన్నంత కాలం అతను జట్టులో ఉండాల్సిందే. జింబాబ్వేతో జరగబోయే తదుపరి మ్యాచ్ భారత్‌కు 'డూ ఆర్ డై' లాంటిది. ఇప్పటికైనా మేనేజ్‌మెంట్ మేల్కొని సరైన నిర్ణయాలు తీసుకోవాలి" అని రహానే సూచించారు. ఈ ఓటమితో భారత్ సెమీఫైనల్ అవకాశాలు ప్రమాదంలో పడ్డాయి. టీమ్ మేనేజ్‌మెంట్ కేవలం గణాంకాలు, మ్యాచ్–అప్‌ల మీద ఆధారపడకుండా ఆటగాళ్ల ప్రస్తుత ఫామ్, నైపుణ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని మాజీ క్రికెటర్లు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా కోరుతున్నారు.

## విండీస్‌ను చిత్తు చేసిన సౌతాఫ్రికా..

### 9 వికెట్ల తేడాతో వెస్టిండీస్ జట్టు చిత్తు

### సౌతాఫ్రికా జట్టు సెమీస్‌కు క్వాలిఫై

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో సౌతాఫ్రికా జైత్రయాత్ర కొనసాగుతోంది. వరుస విజయాలతో లీగ్ దశను అజేయంగా ముగించిన సఫారీ టీమ్.. సూపర్–8 దశలోనే అదే జోరు కొనసాగిస్తోంది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో పటిష్ట భారత్‌ను మట్టికరిపించిన మార్కరమ్ సేన.. తాజాగా డేంజరస్ టీమ్ అయిన వెస్టిండీస్‌ను చిత్తు చేసింది. గురువారం అహ్మదాబాద్ వేదికగా జరిగిన తమ రెండో సూపర్–8 మ్యాచ్‌లో సౌతాఫ్రికా 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయించి విండీస్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో సౌతాఫ్రికా గ్రూప్–1 నుంచి సెమీస్ బెర్త్‌ను దాదాపు ఖరారు చేసుకోగా వెస్టిండీస్ సంక్లిష్టం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 176 పరుగులు చేసింది. జాసన్ హోల్డర్(31 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 49), రొమారియో షెఫర్డ్(37 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 52 నాటౌట్) అసాధారణ ప్రదర్శన కనబర్చారు. ఈ ఇద్దరూ 8వ వికెట్‌కు 89 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. సౌతాఫ్రికా బౌలర్లలో లుంగి ఎంగిడి(3/30) మూడు వికెట్లు తీయగా.. కగిసో రబడా, కార్బిన్ బోష్ రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం సౌతాఫ్రికా 16.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 177 పరుగులు చేసి గెలుపొందింది. ఎయిడెన్ మార్క్‌రమ్(46 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 82 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా.. క్వింటన్ డికాక్(24 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 47), ర్యాన్ రికెల్టన్(28 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 45 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. వెస్టిండీస్ బౌలర్లలో రోస్టన్ ఛేజ్ ఒక వికెట్ తీసాడు. సౌతాఫ్రికా విజయంతో టీమిండియా సెమీస్ అవకాశాలు మెరుగయ్యాయి. ఎలాంటి రన్‌రేట్ టెన్షన్ లేకుండా జింబాబ్వేతో పాటు వెస్టిండీస్‌తో తమ తదుపరి మ్యాచ్‌లను భారత్ గెలిస్తే సరిపోతుంది. ఇందులో ఒక్క మ్యాచ్ ఓడినా ఇంటిబాట పడుతుంది. మరోవైపు ఈ ఘోర పరాజయంతో వెస్టిండీస్ రన్‌రేట్ కూడా భారీగా పడిపోయింది. ం5.350 నుంచి 1.791కు వెస్టిండీస్ రన్ రేట్ తగ్గింది. భారత్‌తో జరిగే తమ ఆఖరి మ్యాచ్‌లో విజయం సాధిస్తేనే విండీస్ సెమీస్ చేరనుంది. లేదంటే ఇంటిబాట పట్టనుంది.

## సూర్య కుమార్ కొత్త అపార్ట్‌మెంట్ కొనుగోలు



టీమిండియా పురుషుల టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ భార్య దేవీషా యాదవ్ ముంబైలోని చెంబూర్ ప్రాంతంలో ?7.18 కోట్లకు ఒక లగ్జరీ అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేసింది. ఆస్తి రిజిస్ట్రేషన్ పత్రాల ప్రకారం ఈ ఒప్పందం ఫిబ్రవరిలో రిజిస్టర్ అయినట్లు తెలుస్తోంది. ఈ 1,516.20 చదరపు అడుగుల అపార్ట్‌మెంట్ గోద్రేజ్ స్కై టెర్రస్‌లో ఉంది. ఆసక్తికరంగా ఏడాది కాలంలో ఈ జంట మూడు అపార్ట్‌మెంట్‌లు కొనుగోలు చేసింది. ఈ ఫ్లాట్ 1,402 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాను కలిగి ఉంది . రెండు పార్కింగ్ స్థలాలతో వస్తుంది. ఈ లావాదేవీలో రూ. 35.90 లక్షల స్టాంప్ డ్యూటీ, రూ. 30,000 రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించారు. 2025లో, దేవీషా యాదవ్ అదే బిల్డింగ్‌లో 17వ, 18వ అంతస్తులలో రెండు అపార్ట్‌మెంట్‌లను కొనుగోలు చేశారు. ఇప్పుడు ఇప్పుడు 18వ అంతస్తులో మరొక అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేశారు. మూడో అపార్ట్‌మెంట్‌ను ఫిబ్రవరి 20, 2026న కొనుగోలు చేశారు. ఈ లావాదేవీపై ?35.90 లక్షల స్టాంప్ డ్యూటీ, ?30,000 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించారు. ఈ ఫ్లాట్ రెండు పార్కింగ్ స్థలాలతో వస్తుంది. జూన్ 2028 నాటికి డెలివరీ చేయనున్నట్టు భావిస్తున్నారు. ఆస్తిని అమ్మింది గోద్రేజ్ ప్రాపర్టీస్ లిమిటెడ్. స్క్వేర్ యార్డ్స్ డేటా ఇంటెలిజెన్స్ ప్రకారం, గోద్రేజ్ స్కై టెర్రసెస్ 1.05 ఎకరాల ప్రాజెక్ట్, ఇందులో 3బీఎఖ, 4బీఎఖ ఆప్షన్‌లు అందుబాటులో ఉన్నాయి. మార్చి 2024, ఫిబ్రవరి 2025 మధ్య, 25 అమ్మకాల రిజిస్ట్రేషన్లు జరిగాయి, మొత్తం ?202 కోట్లు. సగటు ధర చదరపు అడుగుకు దాదాపు ?52,433గా పేర్కొన్నారు. చెంబూర్ సమీపంలోని డియోనార్ ప్రాంతంలో ఉన్న ఇది అద్భుతమైన రోడ్డు, రైలు కనెక్టివిటీని అందిస్తుంది. మార్చి 2025లో కొనుగోలు చేసిన ఈ రెండు అపార్ట్‌మెంట్‌ల మొత్తం కార్పెట్ ఏరియా సుమారు 4,222.7 చదరపు అడుగులు. మొత్తం బిల్ట్–అప్ ఏరియా 4,568 చదరపు అడుగులకుపైగా ఉంది. ఈ ఒప్పందంలో ఆరు కార్ పార్కింగ్ స్థలాలు కూడా ఉన్నాయి. ఆ సమయంలో ?1.26 కోట్ల స్టాంప్ డ్యూటీ, ?30,000 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించారు.

Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999